




డీపీవోగా వెంకటనాయుడు బాధ్యతల స్వీకరణ

ఒంగోలు (కలెక్టరేట్), అక్టోబరు 8 : జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో)గా గొట్టిపాటి వెంకటనాయుడు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కలెక్టర్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వెంకటనాయుడును పంచాయతీ కార్యాలయ ఏవో రాజేంద్రప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ జి.రామకృష్ణతోపాటు కార్యాలయ సిబ్బంది, ఈవోఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



డీపీవో వెంకటనాయుడుకు బొకే ఇస్తున్న కార్యాలయ అధికారులు, సిబ్బంది





జిల్లాలో మద్యం దుకాణాలకు ప్రభుత్వం అంచనా వేసిన స్థాయిలో దరఖాస్తులు పడటం లేదు. దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు తిరిగి రాకపోవడమే ప్రతిబంధకంగా కనిపిస్తోంది. అలాగే లైసెన్సు రుసుం కూడా అధికంగా ఉందని.. చాలాప్రాంతాల్లో ఆ స్థాయిలో అమ్మకాలు, ఆదాయం ఉండకపోవచ్చని భావిస్తున్నారు. ఇక అంతకన్నా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అధికార నేతల జోక్యం, వారి అనుచరుల వ్యవహార శైలి ఇబ్బందికరంగా ఉంది. మా ప్రాంతంలో మాకే షాపులు ఉండాలన్న ఆలోచనను వారు చేస్తున్నారు. దీంతో దరఖాస్తులు మందకొడిగా వస్తున్నాయని సమాచారం.

అధిక ఫీజు.. ఆంక్షలు

మందకొడిగా మద్యం దుకాణాలకు దరఖాస్తులు

- సగటున తొమ్మిది మాత్రమే అందిన వైనం
- ఔత్సాహికులకు కూటమి నేతల బెదిరింపులు
- ప్రతిబంధకంగా (తిరిగిరాని) దరఖాస్తు ఫీజు
- వైసీపీ శ్రేణులు పూర్తిగా దూరం
- 11న లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు

ఒంగోలు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం దుకాణాలకు ప్రభుత్వం ఆశించినస్థాయిలో దరఖాస్తులు అందడం లేదు. ఒకవైపు అధికారపక్ష నేతల ఆంక్షలు, మరోవైపు దరఖాస్తు ఫీజు భారీగా ఉండటం అందుకు ప్రతిబంధకంగా కనిపిస్తోంది. నూతన మద్యం పాలసీలో భాగంగా జిల్లాలో మొత్తం 171 షాపులను నోటిఫై చేశారు. ఒక్కో దుకాణానికి సగటున 25 నుంచి 30 వరకు దరఖాస్తులు వస్తాయని అధికారవర్గాలు అంచనా వేశాయి. ఒక్కో దరఖాస్తుకు చెల్లించే రూ.2లక్షలు ఫీజు తిరిగి ఇచ్చేది లేదని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించడంతో అలా ఫీజు రూపంలోనే జిల్లాలో రూ.100 కోట్ల వరకు ఖజానాకు రాబడి ఉంటుందని భావించారు. దీనికి తోడు 171 దుకాణాలను రెండు కేటగిరీలు చేసి 120 షాపులకు ఒక్కో దానికి ఏడాదికి రూ.65 లక్షలు, మిగిలిన 71 షాపులకు ఒక్కో దానికి రూ.55లక్షలు ఫీజు నిర్ణయించారు. తద్వారా రూ.117 కోట్ల మేర రాబడి వస్తుందని అంచనా వేశారు. అయితే జిల్లాలో ఆస్థాయిలో దరఖాస్తులు పడపడం లేదు. తిరిగి ఇవ్వని దరఖాస్తు ఫీజు గతంలో రూ.50వేలు ఉండగా ప్రస్తుతం దానిని రూ.2లక్షలకు పెంచడం ప్రతిబంధకంగా కనిపిస్తోంది. అలాగే ఏడాది లైసెన్సు ఫీజు కూడా అధికంగా ఉంది.

ఇబ్బందులు తప్పవన్న సంకేతాలతో..

ఈసారి సాధారణ ఎన్నికల్లో భారీగా వెచ్చించాల్సి వచ్చిన నేపథ్యంలో ప్రతి వతకాన్ని ఆదాయ వనరుగా మార్చుకునే పనిలో అధికార పార్టీ నేతలు ఉన్నారు. 'మా వాళ్లు లేదా ముందుగా మాతో అవగాహనకు వచ్చిన వారు దరఖాస్తు చేసుకోండి. లేదంటే ఇబ్బందులు తప్పవు' అన్న హెచ్చరికలు పంపుతున్నారు. ఒకవేళ ఎవరైనా ధిక్కరించి దరఖాస్తు చేసి లాటరీలో దుకాణం పొందినా మా మద్దతు లేకుండా దానిని నడపలేరని హెచ్చరిస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఇలా హెచ్చరికలు బలంగా ఇస్తూ తమ వారి చేత నేరుగా దరఖాస్తులు చేయిస్తున్నారు. మరికొన్ని చోట్ల దుకాణాల కేటాయింపు తర్వాత వాటిని పొందిన వారితో ఒప్పందాలు చేసుకుంటామన్న సంకేతాలు ఇస్తున్నారు. దీంతో చాలాచోట్ల ఔత్సాహికులు దరఖాస్తుకు ధైర్యం చేయడం లేదు. లిక్కర్ వ్యాపారంలో అనుభవం, ఆసక్తి ఉన్న వైసీపీ నేతలు రాజకీయ అండ లేకుండా చేయలేమని దూరంగా ఉంటున్నారు. దీంతో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో దరఖాస్తులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

నేటితో ముగియనున్న గడువు

మద్యం దుకాణాల కోసం దరఖాస్తుకు బుధవారం సాయంత్రంతో గడువు ముగియనుంది. అయితే మంగళవారం రాత్రి 9 గంటల వరకు చూస్తే సగటున ఒక్కో దుకాణానికి తొమ్మిదికి మించి దరఖాస్తులు వచ్చిన పరిస్థితి లేదు. అందిన సమాచారం మేరకు 171 దుకాణాలకు దాదాపు 1,472 దాఖలయ్యాయి. అందులో 32 షాపులకు అత్యధిక సంఖ్యలో వచ్చాయి. ఒంగోలు సర్కిల్‌లో 191 దరఖాస్తులు రాగా, అత్యల్పంగా 16 దుకాణాలు ఉన్న పొదిలి సర్కిల్‌లో 69 అందాయి.

నియోజకవర్గాల వారీ పరిస్థితి ఇదీ..

సంతనూతలపాడు నియోజకవర్గం విషయానికి వస్తే వ్యాపారంలో బాగా అనుభవం ఉన్న ద్వితీయశ్రేణి నేత ఒకరు 'అన్ని షాపులకు మేమే దరఖాస్తులు దాఖలు చేస్తాం. ఇతరులు ఎవ్వరూ రావడానికి వీలు లేదు. అలా వస్తే ఇబ్బందులు తప్పవు. నాకు ముఖ్యనేత పూర్తి మద్దతు ఉంది' అని హెచ్చరికలు పంపడం పెద్ద చర్చనీయాంశమైంది. అయితే సదరు నేత సొంత ప్రాంతానికి చెందిన కొందరు అధికారపార్టీ వారు అతనికి వ్యతిరేకంగా పావులు కదుపుతున్నట్లు సమాచారం.

కొండపి నియోజకవర్గంలో ముఖ్య నేతలు ఈ వ్యవహారానికి దూరంగా ఉన్నట్లు తెలుస్తుండగా వివిధ మండలాల్లో స్థానిక నాయకులు మాత్రం సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తు చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది.

దర్శి నియోజకవర్గంలో అధికార పార్టీ ముఖ్యనేత సమీప బంధువు తొలుత మొత్తం సిండికేట్ చేసి దరఖాస్తులు వేయించాలని భావించినా విమర్శలు వస్తాయన్న ఆలోచనతో వెనక్కి తగ్గినట్లు సమాచారం. షాపులు దక్కించుకున్న వారు వ్యాపారంలో అధికార పార్టీ అండ లేకుండా ఎలాగూ చేయలేరు కనుక అప్పుడు వాటాల విషయం చూసుకోవచ్చని వారు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

గిద్దలూరు నియోజకవర్గంలో కీలక ప్రజాప్రతినిధి ప్రత్యక్షంగా జోక్యం చేసుకోకపోయినా వైసీపీ వారికి మాత్రం దరఖాస్తు చేస్తే ఇబ్బందులు తప్పవన్న సంకేతాలు పంపినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో అక్కడ టీడీపీ, బీజేపీ శ్రేణులు దరఖాస్తులు చేస్తుండగా తర్వాత వాటాలు ఇవ్వక తప్పదన్న చర్చ కూడా సాగుతోంది.

మార్కాపురం నియోజకవర్గంలో ముఖ్యనేత సన్నిహితులు మొదట్లో తమ వర్గీయులు తప్ప ఎవ్వరూ వేయవద్దన్న సంకేతాలు ఇచ్చినా తాజాగా రూటు మార్చారు. 'దుకాణాలు దక్కించుకొన్న వారికి ఎలాగూ మన అండ అవసరం కనుక వారే వస్తారు. అప్పుడు చూద్దాం. మన డిమాండ్ నెరవేర్చుకుందాం'. అన్న భావనకు వచ్చినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఎక్కువ మంది దరఖాస్తులు చేసేందుకు ముందుకు రావడం లేదని అంటున్నారు.

ఒంగోలులో అధికారపార్టీ ముఖ్యనేత తరపున సమీప బంధువు రంగంలోకి దిగి సిండికేట్ ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. 'అన్ని దుకాణాలకు మేము లేదా మా వారు వేస్తారు. ఇతరులు ఎవరు వేసినా ఇబ్బందులు తప్పవు' అని హెచ్చరికలను బయటకు పంపారు. నగరాన్ని ఐదు క్లస్టర్లుగా చేసి ఆ ప్రాంతంలో షాపులకు ఒక్కో దానికి నాలుగైదు దరఖాస్తులు వేసేలా అనుచరులను పురమాయించినట్లు సమాచారం. ఇతరులు దరఖాస్తు చేసినా లాటరీలో వారికి దుకాణం వచ్చినా, తర్వాత అయినా మాకు అప్పజెప్పాల్సిందే. లేదంటే వాటా ఇవ్వాల్సిందేనన్న హెచ్చరికలు చేయడంతో మద్యం వ్యాపారంలోకి రావాలనుకున్న వారు కాస్తంత వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం.

కనిగిరి నియోజకవర్గంలో కీలక ప్రజాప్రతినిధిని కొందరు ద్వితీయశ్రేణి నేతలు ఆశ్రయించగా.. 'ఇప్పుడే ఎందుకు.. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోండి. తర్వాత చూద్దాం' అన్న సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో పలువురు దరఖాస్తు చేస్తున్నారు. అయితే షాపుల కేటాయింపు తర్వాత వాటిని పలుకుబడి ఉన్న అధికార పార్టీ నేతలు దక్కించుకుంటారన్న ప్రచారం సాగుతోంది. అందుకనుగుణంగా ముఖ్యనేతలు.. దుకాణం ఎవరికి వచ్చినా చేసుకోనేది మేమే అన్న సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

యర్రగొండపాలెం నియోజకవర్గంలో మద్యం దుకాణాలకు సాధారణంగా డిమాండ్ తక్కువగా ఉంటుంది. దీంతో అధికారపార్టీ నేతల జోక్యం పెద్దగా కన్పించడం లేదు.

'స్వర్ణాంధ్ర'లో భాగస్వామ్యం కావాలి

- మంత్రి డాక్టర్ స్వామి పిలుపు
- సదస్సులో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు



సదస్సులో పాల్గొన్న మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, కలెక్టర్, ఎమ్మెల్యేలు

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 8: 'స్వర్ణాంధ్ర-2047 విజన్' అజెండాతో చేయనున్న రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర రూపకల్పనలో భాగంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో మంత్రి స్వామి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్గదర్శకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు సమగ్ర కసరత్తు చేస్తున్నామన్నారు. పీఎం మోదీ చెప్పినట్లు స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి దేశం పూర్తిగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో వికసిత్ భారత్ పేరుతో కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. అందులో భాగంగా సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర ద్వారా రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించడం, నిరుద్యోగ సమస్యను రూపుమాపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. మండలం యూనిట్‌గా అభివృద్ధి పథంలో నడిపించేలా చర్యలు చేపట్టారన్నారు. జిల్లాలో ఫార్మా రంగాన్ని ముందుకు తీసుకొచ్చేందుకు, గ్రానైట్ రంగానికి మరింత ప్రోత్సాహం కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వెలిగొండను త్వరగా పూర్తిచేస్తామన్నారు. జిల్లాలో వీలైనంత వరకు చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలను చేపట్టి సమర్థవంతంగా నీటి సంరక్షణకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు మార్కాపురంలో మెడికల్ కళాశాలను అన్ని మౌలిక సదుపాయాలతో త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. దొనకొండ పారిశ్రామికవాడ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని చెప్పారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో జిల్లా అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అన్ని రంగాల ప్రజలను భాగస్వాములను చేసి అందరి సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. మండల స్థాయిలో రాబోయే ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన చేస్తున్నట్లు స్వామి తెలిపారు.

ఎమ్మెల్యేలు చేసిన సూచనలు ఇవీ..

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ తన నియోజకవర్గంతోపాటు జిల్లా అభివృద్ధికి దోహదపడే విధంగా విజన్ డాక్యుమెంట్ రూపొందించడం ఎంతో ఉపయోగకరమన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ రైతులకు ఆదాయం వచ్చే ఉద్యాన పంటలపై విజన్ డాక్యుమెంట్ రూపకల్పన చేయాలన్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వ ఆధీనంలో కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేయాలన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. వర్క్‌షాపులో జేసీ గోపాలకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

గిద్దలూరులో సైనిక్ స్కూల్

ప్రైవేటు సెక్టార్‌లో ఏర్పాటుకు ఎంపీ మాగుంట సంసిద్ధత

సైన్యంలో వివిధ హోదాల్లో పని చేసే వారు అధికంగా ఉన్న గిద్దలూరు నియోజకవర్గంలో ప్రైవేటు సెక్టార్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సంసిద్ధత వ్యక్తం చేశారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌పై నిర్వహించిన సమావేశంలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సమస్యలను వివరిస్తూ గిద్దలూరులో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను చెప్పారు. ఆ సందర్భంగా కలెక్టర్ అన్సారియా జోక్యం చేసుకొని ప్రైవేటు సెక్టార్‌లో కూడా సైనిక్ స్కూల్ ఏర్పాటుకు కేంద్రం అనుమతిచ్చిందన్నారు. ఆ సమయంలో ఎంపీ మాగుంట కల్పించుకొని గిద్దలూరులో ప్రైవేటు సెక్టార్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు ఔత్సాహికులను ప్రోత్సహిస్తానని, కానిపక్షంలో తానే సొంత నిధులు ఇస్తానని చెప్పారు. ఈ సందర్భంగా మాగుంటకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు

మద్రిపూడి, అక్టోబరు 8 : మండలంలోని తిప్పలదేవిపల్లె, సన్నమూరు గ్రామాలలో జరిగిన ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంపీఎస్.లోకేశ్వరరావు మంగళవారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. అసైన్డ్ భూములను గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా ఫ్రీహోల్డ్ చేశారన్న ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఆమేరకు ఎస్డీసీ ఆయా గ్రామాల్లో పర్యటించి క్రయవిక్రయాలు జరిగిన భూములను పరిశీలించారు. సంబంధిత రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మండలంలో 102 ఎకరాలు క్రయవిక్రయాలు జరిగినట్లు గుర్తించామని ఆయన తెలిపారు. ఎక్కడైనా అక్రమాలు చోటుచేసుకున్నట్లు తేలితే రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ నరసింహారావు, ఆర్ఐ రమణ, వీఆర్వోలు సందీప్, బడేసాహెబ్ ఉన్నారు.

నీటి పరీక్షలు అన్ని చోట్లా జరుగుతున్నాయి

● ఈవోఆర్డీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంతనూతలపాడు, అక్టోబరు 8: మండలంలోని అన్ని పంచాయతీల్లో క్లోరినేషన్, నీటి నాణ్యత పరిక్షలు జరుగుతున్నాయని ఈవోఆర్డీ రమణమ్మ తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'క్లోరినేషన్ లేదాయే..నీటి పరీక్ష కరువాయే' కథనానికి ఆమె స్పందించారు. మండలంలో సీపీడబ్ల్యూ, పీడబ్ల్యూలెస్, ఎంపీడబ్ల్యూఎస్ స్కీముల కింద అందిస్తున్న తాగునీటిని క్లోరినేషన్ చేసే అందిస్తున్నామని, అన్ని రకాల పరీక్షలను నిబంధనల ప్రకారం సంబంధిత శాఖ అధికారులతో చేయిస్తున్నామని తెలిపారు. తాగునీటి అందించే స్కీముల వద్ద అవసరమైన పరీక్షలు జరుగుతున్నాయని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా మంచినీటిని అందిస్తున్నమని ఈవోఆర్డీ వివరించారు.

మోటార్‌సైకిల్ నుంచి పడి హెడ్‌కానిస్టేబుల్ మృతి



జయరావు (ఫైల్)

టంగుటూరు, అక్టోబరు 8 : మోటార్ సైకిల్ అదుపు తప్పడంతో కింద పడి హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందాడు. ఈ ఘటన వెంగముక్కలపాలెం సమీపంలో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు... టంగుటూరు పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జి.జయరావు (61) విధుల్లో భాగంగా సోమవారం మోటారు సైకిల్‌పై కొండపి వెళ్లారు. పని ముగించుకొని కె.ఉప్పలపాడు మీదుగా ఒంగోలుకు బయల్దేరారు. వెంగముక్కలపాలెం సమీపంలోని మలుపు వద్ద మోటార్‌సైకిల్ అదుపుతప్పి కిందపడిపోయాడు. ఆ సమయంలో విధులు ముగించుకొని బయటకు వచ్చిన భగీరథ కెమికల్స్ కార్మికులు ఫ్యాక్టరీ అంబులెన్స్‌లో ఆయన్ను ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ జయరావు మంగళవారం మృతి చెందారు.

దశపర్ణి కషాయం తయారీపై అవగాహన



దశపర్ణి కషాయం తయారు చేస్తున్న రైతులు

కొండపి, అక్టోబరు 8 : ప్రకృతి వ్యవసాయంలో భాగంగా మండలంలోని కొండపి పంచాయతీ పరిధి కట్టావారిపాలెంలో అధికారులు దశపర్ణి కషాయం తయారీ విధానాన్ని రైతులకు ప్రదర్శన ద్వారా తెలిపారు. యూనిట్ ఇన్‌చార్జి రంజిత్ ప్రకృతిలో దొరికే పది రకాల ఆకులతోపాటు పచ్చిమిర్చి, వెల్లుల్లి, పసుపు పొడి, అల్లం కలిపి పేస్ట్ చేయించారు. దీనిని పంటలపై పిచికారీ చేస్తే లద్దె పురుగు, పచ్చపురుగు లాంటి చీడపీడల నుంచి కాపాడుకోవచ్చని వివరించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంలో పంటలు పండించి ఆదాయం పొంది ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొండపి, అక్టోబరు 8 : మండలంలోని పెట్లూరు సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కుంచాల కోటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ పనుల దృష్ట్యా పెట్లూరు పంచాయతీలోని గ్రామాలతోపాటు గుర్రప్పడియ, మూగచింతల, తాటాకులపాలెం, చినకండ్లగుంట పంచాయతీల్లోని గ్రామాల్లో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కరాటేలో శివరాయునిపేట చిన్నారి సత్తా



బహుమతిని అందుకుంటున్న ఎప్రా

మద్రిపూడి, అక్టోబరు 8 : జాతీయ స్థాయి కరాటే పోటీలలో శివరాయునిపేటకు చెందిన ఆరో తరగతి విద్యార్థి టి.ఎప్రా సత్తా చాటాడు. ఈనెల 6న చెన్నైలో జరిగిన 21వ సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా గ్రామస్థులు అభినందించారు.

ఆటోడ్రైవర్‌పై రౌడీషీటర్ దాడి

● బర్త్‌డే పేరుతో హల్‌చల్

ఒంగోలు(క్రైం), అక్టోబరు 8: బర్త్‌డే పేరుతో పూటుగా మద్యం తాగిన ఓ రౌడీషీటర్ తన స్నేహితులతో కలిసి ఆటో డ్రైవర్‌పై దాడి చేసి చితకబాదారు. ఈ సంఘటన మంగళవార తెల్లవారుజామున 3 గంటల సమయంలో స్థానిక పాతమార్కెట్ వద్ద జరిగింది. వివరాలలోకి వెళితే.. స్థానిక అన్నవరప్పాడు ఐదోలైన్‌లో నివాసం ఉండే ఆటోడ్రైవర్ ఉంగరాల సాయికృష్ణ రిమ్స్ వద్ద ప్రయాణికులను ఎక్కించుకొని కర్నూలురోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు వెళుతున్నాడు. మార్గమధ్యలో పాతమార్కెట్ వద్ద డైమండ్ టీస్టాల్ వద్ద ప్రయాణికులు టీ తాగేందుకు ఆటోను ఆపమన్నారు. దీంతో అటువైపు వెళుతుండగా రౌడీషీటర్ కొత్తపల్లి హరీష్ అలియాస్ గత్తర్, జాన్సన్, అగస్టీన్‌లు ఆటోకు అడ్డుగా వచ్చారు. దీంతో ఆటో నిలిపివేయడంతో డ్రైవర్ సాయికృష్ణతో గొడవకు దిగారు. తమపైకి ఆటో నడుపుతావా అంటూ గొడవకు దిగి హరీష్‌ను గత్తర్ తన స్నేహితులతో కలిసి దాడి చేశారు. తనను చంపే ప్రయత్నం చేశారని బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు



విత్తనశుద్ధిని పరిశీలిస్తున్న డీఏవో శ్రీనివాసరావు

టంగుటూరు, అక్టోబరు 8 : విత్తనశుద్ధితో శనగ సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు సూచించారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా సూరారెడ్డిపాలెంలో రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులతో కలిసి ఆయన పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఒంగోలు సబ్‌డివిజన్ వ్యవసాయ సంచాలకులు బి.రమేష్‌బాబు, మండల వ్యవసాధికారి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో నియామకంపై గందరగోళం

జీవోను నిలిపివేశారంటూ ప్రచారం

రద్దు చేస్తున్నట్లు

ఇంతవరకూ రాని సర్క్యులర్

రత్నావళి బాధ్యతల స్వీకరణపై నీలినీడలు

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 8 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా రత్నావళి నియామకంపై గందరగోళం నెలకొంది. గత నాలుగు నెలల నుంచి డీఎంహెచ్‌వో పోస్టు ఖాళీగా ఉండటంతో విజయవాడ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రత్నావళిని నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆ విషయం బయటకు వచ్చిన వెంటనే ఆమె నియామకాన్ని వ్యతిరేకిస్తూ ప్రజాప్రతినిధుల వద్దకు కొందరు పరుగులు పెట్టారు. 2020 నుంచి 2022 మధ్య కాలంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిగా పనిచేసిన రత్నావళిపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఆమె పనిచేసిన కాలంలో పలుర కాల నియామకాల్లో అక్రమాలు చోటుచేసుకోవడంతోపాటు ఆమెపై లోకాయుక్తకు సింగరాయకొండకు చెందిన లక్ష్మీనారాయణ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. అయితే సరైన సమాచారం ఇవ్వకపోవడంతో 2022లో లోకాయుక్త ప్రభుత్వానికి సరెండర్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఆమెను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో పోస్టుల భర్తీ నుంచి ఉద్యోగోన్నతులు, డిప్యుటేషన్లు, ఒకచోట పనిచేస్తున్న ఉద్యోగికి ఎటువంటి ఆర్డర్ లేకుండా మరోచోట పనిచేసే విధంగా మౌఖిక ఆదేశాలు వంటి పలు ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలపై కూడా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విచారణ చేసినా ఎలాంటి చర్యలు లేకుండాపోయాయి.

అందని సర్క్యులర్..

ఈ నేపథ్యంలో తిరిగి మరలా డీఎంహెచ్‌వోగా రత్నావళి నియమితులయ్యారు. ఓ జనసేన నాయకుడి ద్వారానే ఆమె జిల్లాకు వస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ నియామకం జరిగిన వెంటనే ఇప్పటివరకు ఆ పోస్టు కోసం ప్రయత్నాలు చేస్తున్న అధికారులు ఖంగుతినడంతోపాటు ఆమె డీఎంహెచ్‌ఓగా ఉన్న సమయంలో ఇబ్బందులు పడిన వైద్యశాఖలోని డాక్టర్లు, వివిధ స్థాయిల్లోని ఉద్యోగులు వెంటనే ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ విషయాన్ని వెంటనే ప్రిన్సిపల్ సెక్రటరి ఎంటీ కృష్ణబాబు దృష్టికి తీసుకెళ్లారనే ప్రచారం జరుగుతోంది. అయితే ఆమెను నిలిపివేస్తున్నట్లు ప్రచారం మాత్రం నడుస్తోంది. అయితే నిలిపివేస్తున్నట్లు మంగళవారం సాయంత్రం వరకు కూడా సర్క్యులర్ రాకపోవడంతో పరిస్థితి ఏమిటనేది తెలియక అయోమయం నెలకొంది.

ఆమె డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించాలన్నా వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టరేట్ నుంచి మూవ్‌మెంట్ ఆర్డర్ కూడా రావాల్సి ఉంది. కానీ మంగళవారం సాయంత్రం వరకు ఆ ఆర్డర్ వచ్చిన పరిస్థితి లేదు. ఏదిఏమైనా డీఎంహెచ్‌వో నియామకం విషయంలో నెలకొన్న గందరగోళానికి వెంటనే తెరదించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

'పల్లెపండుగ'ను పూర్తిస్థాయిలో ప్రారంభించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 8: గ్రామసభల్లో గుర్తించిన పనులన్నింటినీ వచ్చేవారంలో జరిగే పల్లె పండుగ కార్యక్రమంలో పూర్తి స్థాయిలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంగళవారం అమరావతి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో చేపట్టనున్న కార్యక్రమాలను , ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల వివరాలను ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 972 పనులకు పరిపాలనా అనుమతులు ఇచ్చామని, 928 పనులకు సాంకేతిక అనుమతులు లభించాయన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలకు కూడా సాంకేతిక అనుమతులు లభిస్తే వాటిని కూడా చేపడతామని చెప్పారు. నిర్మాణ పనులు చేపట్టేందుకు ఇసుక పరంగా సమస్యలు లేవని, సిమెంట్ సరఫరా సకాలంలో జరిగేలా ప్రభుత్వం పర్యవేక్షిస్తే జనవరి నాటికి ఈ పనులన్నింటినీ పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. పనులన్ని స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ఇప్పటికే ప్రణాళిక రూపొందించామని అన్సారియా వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, జడ్పీసీఈవో చిరంజీవి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యాంశాలతోపాటు జనరల్ నాలెడ్జ్ పెంపొందించాలి

విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు జనరల్ నాలెడ్జ్ పెంపొందించేలా బోధన ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. మంగళవారం ఒంగోలులోని కేంద్ర విద్యాలయంలో జరిగిన మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం ప్రిన్సిపాల్ ఎం.మనీష్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఉత్తమ పౌరులుగా జీవించేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. క్రమం తప్పకుండా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు వారు గ్రూపు యాక్టివిటీస్‌లో పాల్గొనేలా చూడాలని చెప్పారు. పిల్లల్లో ఉన్న సృజనాత్మకతకు గుర్తించి అందుకు అనుగుణంగా బోధన ఉండాలన్నారు. పాఠశాల పక్కనే అందుబాటులో ఉన్న ప్లేగ్రౌండ్ కోసం భూమి కేటాయింపు విషయాన్ని పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు స్లైప్ సీఈవో లోకేశ్వరరావు, డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్, రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్‌బాబు, జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సూర్యప్రకాశరావు, కార్పొరేషన్ ఇంజనీర్ పద్మజ పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలును నెరవేర్చడమే లక్ష్యం

● ఎమ్మెల్యే దామచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), అక్టోబరు 8: టీడీపీ కూటమిపై ప్రజలు పెట్టుకున్న ఆకాంక్షలను నెరవేర్చడానికి కృషి ప్రభుత్వం చేస్తుందని, అందుకోసం అందరం సమష్టిగా పని చేయాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలు నగరం కర్నూలురోడ్‌లోని ఓ హోటల్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జుల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన దామచర్ల మాట్లాడారు. 100 రోజుల కూటమి ప్రభుత్వంలో ప్రజలకు ఎంతో చేరువ అయ్యామని చెప్పారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవ చేయడంతోపాటు, సమష్టిగా అందరం కష్టపడి ముందుకెళదామన్నారు. అదేవిధంగా తను కూటమి శ్రేణులకు అన్ని వేళలా అండగా ఉంటానని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెవరేర్చడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ అధ్యక్షులు రియాజ్, రవిశంకర్, మేయర్ సుజాత, మంత్రి శ్రీనివాసరావు, కొరారి నాగేశ్వరరావు, కూటమి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వేటు ఎవరి పైనో..?

బదిలీల పంచాయితీపై ఆందోళన

పూర్తిస్థాయిలో ఆరా తీస్తున్న విచారణాధికారి

తమ పరిస్థితి ఏమిటో అర్థంకాక ఉద్యోగుల్లో కలవరం

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 8 : జిల్లా పంచాయతీ ఉద్యోగుల బదిలీలలో జరిగిన అక్రమాలపై విచారణ నేపథ్యంలో సంబంధిత ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ప్రభుత్వం ఇటీవల ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో దానిని కొందరు అధికారులు ఆదాయ వనరుగా మార్చుకున్న విషయం తెలిసిందే. గ్రేడ్-5, 6 ఉద్యోగులను బదిలీ చేసేందుకు కౌన్సెలింగ్ నిర్వహించినా ఉత్తర్వులు ఇచ్చే విషయంలో జరిగిన పరిణామాలు తెలిసి అందరూ అవాక్కయ్యారు. ఆర్డర్లను ఇచ్చే విషయమై ఆయా ఉద్యోగులను ఒంగోలుకు రప్పించుకొని బేరసారాలు పెట్టిన విషయం తెలిసిందే. అయితే భారీ టార్గెట్ పెట్టడంతో ఉద్యోగులు అంత మొత్తం చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో వెలుగులోకి తీసుకురావడంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆరా తీయడంతోపాటు సమగ్ర విచారణకు ఆదేశించారు. ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ (ఎస్డీసీ) లోకేశ్వరరావును విచారణాధికారిగా నియమించారు.

పూర్తిస్థాయిలో విచారణ

గ్రేడ్-5, 6 ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులు ఇచ్చే విషయంలో జరిగిన పరిణామాలపై పూర్తిస్థాయి విచారణను విచారణాధికారి చేపట్టారు. కార్యాలయంలో ఈ ఉత్తర్వులు ఇచ్చే అధికారి, కీలక ఉద్యోగులతో పాటు సంబంధిత ఉన్నతాధికారిని విచారించారు. అయితే ఈ విచారణలో ఇన్‌చార్జీ డీపీవో ఉషారాణి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బదిలీలను చేపట్టానని ఆయనకు చెప్పినట్లు తెలిసింది. వివిధ కారణాలతో ఆర్డర్లు ఇచ్చేందుకు జాప్యం జరిగినట్లు పేర్కొన్నారు. బయట జరిగిన పరిణామాలకు తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. దీంతో సంబంధిత ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. తమకు అండగా ఉంటారనుకున్న వారే బయట జరిగే పరిణామాలకు తనకు సంబంధం లేదని చెప్పడంతో ఆయా ఉద్యోగులు వణికిపోతున్నారు. మరోవైపు విచారణాధికారి బదిలీల ఉత్తర్వులు పొందిన ఉద్యోగులతో కూడా మాట్లాడినట్లు సమాచారం. వారు మొత్తం పూసగుచ్చినట్లు చెప్పినట్లు తెలుస్తోంది. బదిలీల ఆర్డర్‌ను పొందేందుకు ఎంత ఇచ్చింది, ఎవరికి ఇచ్చింది తదితర వివరాలను కూడా విచారణాధికారి సేకరించినట్లు సమాచారం. ఈ విషయాలన్ని ప్రస్తుతం బహిర్గతం కావడంతో ఎవరిపై వేటు పడుతుందోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

డెంగ్యూ ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

రాష్ట్ర వైద్యాఆరోగ్యశాఖ అధికారుల బృందం



వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ వీరరాజు

కొత్తపట్నం(ఒంగోలునగరం), అక్టోబరు 8: గ్రామంలో డెంగ్యూ ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర వైద్యాఆరోగ్యశాఖ అధికారుల బృందం ఆదేశించింది. మంగళవారం కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామంలో పర్యటించింది. అసిస్టెంట్ డైరెక్టర్ జి.వీరాంజనేయులు ఆధ్వర్యంలోని ఈ బృందం గ్రామంలో పర్యటించి డెంగ్యూ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్థులకు, వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. గత నెల 28వ తేదీన అల్లూరు ఎస్సీకాలనీకి చెందిన రోగి డెంగ్యూతో ఒంగోలు రిమ్స్‌లో చేరారు. దీంతో వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామంలో డెంగ్యూ దోమల నివారణకు పలు చర్యలు చేపట్టారు. పంచాయతీ ఆధ్వర్యంలో ఫాగింగ్, బ్లీచింగ్ చల్లే కార్యక్రమాలు చేపట్టారు. వైద్యఆరోగ్యశాఖ, ఎంటమాలజీ విభాగం అధికారులు గ్రామంలో చేపట్టిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. నీటినిల్వలను పరిశీలించారు. దోమల లార్వా నిర్మూలన కార్యక్రమాలు ఫలితాన్ని ఇచ్చాయా అనే దిశగా పరిశీలన జరిపారు. గ్రామంలో ఇంకా జ్వరపీడితులు ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఎంటమాలజీ బృందంలో నాగరాజు, కోడెల శ్రీనివాసరావు, జిల్లా మలేరియా కార్యాలయం సబ్ యూనిట్ అధికారి సాగర్, కొత్తపట్నం హెల్త్ ఆఫీసర్ ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

చినుకుపడితే చెరువే..
అధ్వానంగా కర్నూలు రహదారి





రామతీర్థం నుంచి మద్రిచెట్లపాలెం వరకు చెరువును తలపిస్తున్న రోడ్డు

చీమకుర్తి, అక్టోబరు 8 : పశ్చిమ ప్రకాశానికి ముఖద్వారం, అత్యంత రద్దీ రహదారుల్లో ఒకటిగా ఉన్న ఒంగోలు నుంచి కర్నూలు వెళ్లే రాష్ట్ర రహదారి పరిస్థితి అత్యంత దుర్భరంగా మారింది. చినుకు పడితే రహదారి చెరువును తలపిస్తూ ప్రయాణికులకు నరకప్రాయంగా మారింది. మంగళవారం ఈప్రాంతంలో కురిసిన చిన్నపాటి వర్షానికే చీమకుర్తి నుంచి మద్రిచెట్లపాలెం వరకూ పలు ప్రాంతాల్లో నీరు నిలిచి చెరువుల్లా మారాయి. దీంతో రహదారిపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు తీవ్రస్థాయిలో ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టి సారించి రహదారికి శాశ్వతంగా మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అవీ..ఇవీ..

బంగారం షాపులో మహిళ పర్సు చోరీ

ఒంగోలు(క్రైం), అక్టోబరు 8: ఒంగోలులోని ఓ బంగారంషాపులో మహిళ పర్సును దొంగలు తస్కరించారు. ఈ సంఘటన స్థానిక గాంధీరోడ్డులోని శ్రీరామ జ్యూవెలర్స్‌లో మంగళవారం జరిగింది. మద్రిపూడి మండలం అయ్యపురాజుపాలెం గ్రామానికి చెందిన జి.ఆదిలక్ష్మి బంగారంషాపులో వెండి పట్టీలు కొనేందుకు వెళ్ళింది. అక్కడ పట్టీలు చూస్తూ తన చేతిలో ఉన్న పర్సును పక్కన ఉన్న కుర్చీలో పెట్టింది. అనంతరం పట్టీల కొనుగోలు చేసేందుకు పర్సు చూడగా అక్కడ కనిపించలేదు. అయితే గుర్తు తెలియని ముగ్గురు మహిళలు చోరీ చేసినట్లు దుకాణం నిర్వాహకులు అనిమానించారు. పర్సులో రూ.25వేల నగదు, రెండు జతలు కాళ్ళపట్టీలు ఉన్నట్లు బాధితురాలు వాపోయింది. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేజీబీవీల్లో 52 బోధనేతర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఒంగోలు(విద్య), అక్టోబరు 8: సమగ్రశిక్ష సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న కస్తూర్బాగాంధీ బాలికావిద్యాలయాల్లో (కేజీబీవీ) ఖాళీగా ఉన్న 52 బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకి డీఈవో సుభద్ర మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఔట సోర్సింగ్ విధానంలో వీరిని నియమించనున్నారు. టైప్-2 కేజీబీవీల్లో 42 పోస్టులకు గాను హెడ్‌కుక్-7, నైట్‌వాచ్‌మెన్ ఉమెన్ 6, స్కావెంజర్ 5, స్వీపర్ 5 ఖాళీలు ఉన్నాయి. కేజీబీవీల్లో 10 పోస్టులకు గాను హెడ్‌కుక్ 3, అసిస్టెంట్ కుక్ 3, ఇతర పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హులైన మహిళలు ఈనెల 15లోపు ఎంఈవో కార్యాలయాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. 16న మండలాల వారీగా దరఖాస్తుదారుల జాబితాను ప్రకటిస్తారు. 18న జిల్లాస్థాయిలో అర్హుల జాబితాను ప్రకటిస్తారు. 21న ఎంపిక కమిటీ అర్హులను ఎంపిక చేసి జాబితాను వెల్లడిస్తారు.

వేప కషాయంతో చీడపీడలు దూరం



రైతులకు అవగాహన కల్పిస్తున్న రమేష్‌బాబు

మద్దిపాడు, అక్టోబరు 8: వేప కషాయం ద్వారా పంటల్లోని చీడపీడలను నివారించవచ్చని ఏవో జి.రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం మల్లవరం, కొలచనకోట గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. పురుగు మందులు విచ్చలవిడిగా వాడడం వల్ల భూసారం తగ్గిపోతుందని చెప్పారు. ఎకరానికి రెండు టన్నుల పశువుల ఎరువును వాడాలని, వేపగింజల కషాయం ద్వారా ఆకు ముడత లేకుండా నివారించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో మల్లవరం సర్పంచ్ నారా సుబ్బారెడ్డి, ఎంపీటీసీ బోయపాటి వీరాంజనేయులు, సర్పంచ్ డొక్కా మరియమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జి దేవబత్తిన ప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటశేషారావు, వీఏలు దామేశ్వర్, హరితేజ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతి



వృద్ధుడి మృతదేహం

మద్దిపాడు, అక్టోబరు 8: వాహనం ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన మంగళవారం ఏడుగుండ్లపాడు వద్ద జరిగింది. మృతుడికి 60 సంవత్సరాల వయస్సు ఉంటుంది. రాత్రి వృద్ధుడు నడిచి వస్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే చనిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై శివరామయ్య సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హక్కులను కాపాడుకోవడమే బాలగోపాల్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 8 : ప్రజాస్వామిక హక్కులను కాపాడుకో వడంతో పాటు అన్ని రకాల అణిచివేతలకు వ్యతిరేకంగా పోరాడటమే బాలగోపాల్‌కు ఘనమైన నివాళి అని పలువురు పేర్కొన్నారు. మానవ హక్కుల ఉద్యమనేత డాక్టర్ బాలగోపాల్ 15వ వర్ధంతిని మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మంచిపుస్తకం షాపు వద్ద నిర్వహించారు. ముందుగా బాలగోపాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్‌రావు మాట్లాడుతూ తన రచనల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసిన ప్రజాస్వామిక వాది అని బాలగోపాల్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కత్తి కళ్యాణ్, ఎం.జార్జి, బి.సుబ్బారావు, డాక్టర్ సుధాకరరావు, పేరయ్య, తోరటి ఆనంద్, వెంకటస్వామి, ధరణికోట లక్ష్మీనారాయణ, వేజండ్ల శివరావు, ఆవుల సుబ్రహ్మణ్యం, లింగ వెంకటేశ్వర్లు, పిన్నిక శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్ఐను కలిసిన దళిత నాయకులు

సంతనూతలపాడు, అక్టోబరు 8: సంతనూతలపాడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వి.అజయ్‌బాబును మంగళవారం స్థానిక దళితనాయకులు పలువురు కలిసి బొకే అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరరావు, కొండలరావు, అశోక్, చేజర్లయ్య పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు పరిశీలన



వరి పంటలను పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

నాగులుప్పలపాడు అక్టోబరు 8: ఖరీఫ్ సీజనలో ఈ-పంట నమోదు చేసిన సాగు చేసిన వరి పొలాలను తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. తిమ్మసముద్రం గ్రామంలో వరి సాగు చేపట్టిన రైతులు, పంట వివరాలను వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ-పంట వెబ్‌సైట్‌లో నమోదు చేసిన నేపథ్యంలో మంగళవారం తహసీల్దార్ ఆయా పొలాలను సందర్శించారు. రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని, సర్వే నంబరు ఆధారంగా పంట వివరాలతో కలిపి జియోట్యాగింగ్ చేయడం ద్వారా పంట సాగు వివరాలలో కచ్చితత్వం ఉంటుందన్నారు. తద్వారా ప్రభుత్వం అందించే అన్ని పథకాలకు అర్హత పొందుతారన్నారు. ఆయన వెంట ఏవో వెంకట్రావు, వీఆర్వో సుబ్బరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న న్యాయవాది ధనలక్ష్మి

కొత్తపట్నం(ఒంగోలు నగరం), అక్టోబరు 8: న్యాయ వ్యవస్థలో కూడా మహిళలకు సమాన అవకాశాలు ఉన్నాయని, వాటిని గుర్తించి తమ న్యాయమైన హక్కులు పొందాలని న్యాయవాదులు కాట్రగడ్డ అరుణ, ఎన్.ధనలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం కొత్తపట్నంలోని వెలుగు కార్యాలయంలో విధాన్ సే సమాధాన్ పేరుతో జరిగిన మహిళా న్యాయ విజ్ఞాన సదస్సులో వారు మాట్లాడారు. పని ప్రదేశాలలో మహిళల పట్ల జరుగుతున్న లైంగిక దాడులు, వాటిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు నిర్మూలనకు కృషి జరగాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా బాధిత మహిళలకు ఉచిత న్యాయ సహాయం అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు ప్రాజెక్టు మేనేజర్ నరసింహారావు, సీడీపీవో కె.ఫణిరాజకుమారి, ఏపీఎం విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలునగరం, అక్టోబరు 8: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇచ్చేందుకు అర్హత కలిగిన శిక్షణ సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ ఎన్.లక్ష్మానాయక్ మంగళవారం కోరారు. శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకునే సంస్థలు గత రెండు డీఎస్సీ నియామకాలకు కోచింగ్ నిర్వహించి ఉండాలి. గత డీఎస్సీ నియామకంలో సదరు సంస్థలో శిక్షణ పొందిన వారిలో కనీసం 100మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు పొంది ఉండాలి. సంస్థలకు మూడు సంవత్సరాల సరాసరి టర్నోవర్ రూ.40 లక్షలు ఉండాలి. శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తి, అర్హత ఉన్న సంస్థలు ఈ ప్రొక్యూర్‌మెంటు పోర్టల్‌లో ఈ నెల 21వ తేదీలోగా దరఖాస్తు చే సుకోవాలని లక్ష్మానాయక్ కోరారు.

గ్రామ అభివృద్ధికి కృషి చేయాలి

ఒంగోలు(రూరల్), అక్టోబరు8: ఉపసర్పంచ్, వార్డు సభ్యులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో రాజశేఖరరావు కోరారు. మంగళవారం ఒంగోలు ఎంపీడీవో శిక్షణ కార్యక్రమం జరిగింది. ముందుగా గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ బాలచెన్నయ్య పాల్గొన్నారు.


కొత్తపట్నంరోడ్డులో రాజరాజేశ్వరి అమ్మవారు


గాయత్రీ మందిరంలో..


ఒంగోలులోని వాసవీ అమ్మవారికి రూ.10లక్షల కరెన్సీతో మహాలక్ష్మి అలంకరణ


గుంటుపాలెంలో..


బాలాజీరావుపేటలో అమ్మవారు

మహాలక్ష్మీ నమోస్తుతే!

• భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవాలు

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 8: దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలలో ఆరో రోజైన మంగళవారం అమ్మవారు వివిధ ఆలయాలలో మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలు దేవాలయాలలో అమ్మవారికి కరెన్సీ నోట్లతో చేసిన అలంకారం భక్తులను విశేషంగా ఆకర్షించింది. ఒంగోలు నగరం అమలనాథునివారి వీధిలోని శ్రీవాసవి కన్యకా పర మేశ్వరి దేవస్థానంలో వాసవి అమ్మవారికి రూ.10లక్షల కరెన్సీతో మహాలక్ష్మిగా అలంకరించారు. వాసవి తదియారాధన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ముందుగా శ్రీసూక్త సహితంగా ఆవుపాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం వాసవి కోలాట భజన మండలి ఆధ్వర్యంలో మహిళలు ప్రదర్శించిన కోలాటం భక్తియుతంగా కొనసాగింది. అటు కొత్తపట్నం బస్టాండు శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో సైతం పార్వతీఅమ్మవారిని కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. ప్రధాన అర్చకులు మణికంఠశర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఈవో బోడపాటి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదేవిధంగా స్థానిక కేశవస్వామిపేట శ్రీప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థానంలో అమ్మవారు విజయలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పొన్నూరు వేంకటశ్రీనివాసులుచే ఏర్పాటు చేసిన మహిషాసుర మర్దిని స్తోత్ర మహాత్యం ఆధ్యాత్మిక ఉపన్యాసం భక్తులను అలరించింది. ఆలయ ఈవో ఆర్.శివశంకర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక కేశవస్వామిపేటలోని శ్రీవిజయదుర్గా దేవస్థానంలో అమ్మవారికి మహాచండీగా అలంకరణ చేశారు. ప్రధాన అర్చకులు జొన్నలగడ్డ వేదసాయిశర్మ విశేష కుంకుమార్చన నిర్వహించారు. అటు మంగమూరు రోడ్డులోని శ్రీఅచలానంద ఆశ్రమంలో సైతం అమ్మవారికి కరెన్సీ నోట్లతో మహాలక్ష్మి దేవిగా అలంకరణలు నిర్వహించారు. నిర్వాహకులు శ్రీ పరిపూర్ణ సిద్ధానంద స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. నగరంలోని పలు దేవాలయాలలో అమ్మవారికి మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు సరస్వతీదేవిగా..

ఇక దసరా ఉత్సవాలలో అత్యంత ముఖ్యమైన రోజు మూలా నక్షత్రం. ఉత్సవాలలో ఏడవ రోజు ప్రతి సంవత్సరం మూలా నక్షత్రం వస్తుంది. మూలా నక్షత్రం సరస్వతీ దేవి జన్మ నక్షత్రం కావటంతో ఆ రోజు వివిధ ఆలయాలలో అమ్మవారికి సరస్వతీదేవిగా అలంకరణ నిర్వహిస్తారు. అదేవిధంగా పలు పాఠశాలలు, సంస్థల ఆధ్వర్యంలో సైతం ప్రత్యేకంగా సరస్వతీ పూజలు జరుగుతాయి.

మహాలక్ష్మి రూపంలో..

ఒంగోలు(రూరల్): ఒంగోలు నగరం కొప్పోలులోని శ్రీచెన్నకేశవస్వామి దేవాలయంలో మంగళవారం శరన్నవరాత్రులలో భాగంగా శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారికి శ్రీ మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు సమీర్‌కుమార్ తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆరోరోజైన మంగళవారం అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు కనువిందుచేశారు. చీమకుర్తి పట్టణంలోని హరిహరక్షేత్రంలో అమ్మవారిని రూ.6.52 లక్షల విలువచేసే కరెన్సీ నోట్లతో అలంకరించారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు, శిద్దా పాండురంగారావు, శిద్దా సుధావళి, కుటుంబసభ్యులు అమ్మవారిని దర్శించుకొని విశేషపూజలు జరిపారు. ఇక పట్టణంలోని వీరభద్రస్వామి ఆలయం, సాక్షిరామలింగేశ్వరస్వామి, గాంధీనగర్, రామ్‌నగర్ తదితర ఆలయాల్లో దసరా వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

పూర్ణచంద్రరావు పూజలు

జరుగుమల్లి(కొండపి): మండలంలోని కామేపల్లి గ్రామంలోని శ్రీపోలేరమ్మ ఆలయంలో టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శ్రీధర శ్రీనివాసశర్మ గోత్రనామార్చన చేసి అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బైరాగి చౌదరి పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: శరన్నవరాత్రుల్లో ఆరో రోజైన మంగళవారం కొండపిలోని గంగాపార్వతీసమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలోని పార్వతీదేవి మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. రూ.లక్ష విలువైన రూ.500 నోట్లతో అమ్మవారిని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేశారు.


అచలానంద ఆశ్రమంలో..


వాసవి అమ్మవారి ఆలయంలో కోలాటం


కొండపిలో పార్వతీదేవి మహాలక్ష్మిగా..


హరిహరక్షేత్రంలో శిద్దా రాఘవరావు పూజలు


ఒంగోలు నగరం లాయర్‌పేట సాయిబాబా ఆలయంలో..

ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

• ఎమ్మెల్యే దామచర్ల


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల, పక్కన ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఒంగోలు(కార్పొరేషన్), అక్టోబరు 8: నగరంలోని ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని, అర్హులైనవారికి ఇంటి స్థలాలు అందజేస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. మంగళవారం స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో ఎస్సీఎస్టీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోస్టల్‌శాఖ సహకారంతో ప్రమాద బీమా పాలసీ పత్రాలను అందజేశారు. ముఖ్యఅతిథులు ఎమ్మెల్యే దామచర్ల, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ అభివృద్ధి, సమస్యల పరిష్కారంలో బాధ్యతగా వ్యవహరిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. త్వరలోనే అర్హులైన అందరికీ ఇళ్ల స్థలాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జర్నలిస్టులు, కెమెరామెన్‌లకు బీమా పత్రాలు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షులు గేరా అజయ్‌బాబు అధ్యక్షతన జరిగి కార్యక్రమంలో పారిశ్రామికవేత్త కంది రవిశంకర్, డాక్టర్ జాలాది మణిబాబు, కార్యదర్శి ఒంగోలు వసంత్ కుమార్, కోశాధికారి వేశపోగు కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరులో జిల్లా ఆస్పత్రిని ఏర్పాటు చేయాలి

• ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 8 : జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతం గిద్దలూరు నియోజకవర్గమని, అందువల్ల జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని శాసనసభ్యుడు ముత్తుముల అశోక్‌రెడ్డి కోరారు. తమ ప్రాంత ప్రజలు ఏదైనా ప్రమాదం జరిగితే వందల కిలో మీటర్లదూరంలో ఉన్న ఆస్పత్రులకు పోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. మార్కాపురంలో మెడికల్‌కాలేజీ ఉన్నందున అక్కడ ఉన్న ప్రభుత్వ వైద్యశాలను గిద్దలూరులో ఏర్పాటు చేయాలని కోరారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన స్వర్ణాంధ్ర-2047 వర్క్‌షాపులో ఎమ్మెల్యే మాట్లాడారు. గిద్దలూరు ప్రాంతం అన్ని పరిస్థితులకు దూరంగా ఉందని, ఈవిషయాన్ని గుర్తించి విజన్ డాక్యుమెంట్‌లో పొందుపర్చాలన్నారు. ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే వ్యవసాయరంగం, విద్యారంగం అవసరమని, కానీ గిద్దలూరు నియోజకవర్గంలో ఆ పరిస్థితులు లేవన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నీళ్ళు ప్రతి ఎకరాకు పారే విధంగా ప్రణాళిక రూపొందించాలన్నారు. గిద్దలూరులో సైనికులు ఎక్కువ మంది ఉన్నందున వారి పిల్లలకు సైనికుల స్కూలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి పథకం ద్వారా మెటీరియల్ కాంపొనెంట్ నిధులను నియోజకవర్గానికి ఎక్కువ కేటాయించాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక రాయితీలు, నిధులు అందించాలని, జలజీవన్ పథకంలో గత ప్రభుత్వం కాంట్రాక్టర్లు పనులు చేయకుండా వెళ్ళారని, టెండర్ల పనులు పూర్తిచేయని పరిస్థితి ఏర్పడిందన్నారు. నీటి కొరతను అధికమించేందుకు పాత టెండర్లను రద్దు చేసి కొత్తవి పిలవాలని చెప్పారు. గత ప్రభుత్వంలో దివ్యాంగుల పింఛన్లలో భారీ అవినీతి జరిగిందని, దీనిపై విచారణ చేసి అర్హులైన వారికి పింఛన్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

మాగుంట కుటుంబసభ్యులకు కేవీపీ పరామర్శ


ఎంపీ మాగుంటతో మాట్లాడుతున్న రామచంద్రరావు


ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 8: ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యులు కేవీపీ.రామచంద్రరావు పరామర్శించారు. ఇటీవల ఒంగోలు మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో మంగళవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలిసి మాగుంట నివాసానికి వెళ్లారు. ముందుగా మాగుంట పార్వతమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపట్నం(ఒంగోలునగరం) అక్టోబరు 8: ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. మంగళవారం స్థానిక గుండమాలలో పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ సహాయకులు డేవిడ్, ఏవో మోహనరెడ్డి, ఉద్యానశాఖాధికారి తేజ, పశు సంవర్ధకశాఖాధికారి వినయ్ ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు సబ్సిడీ డీజిల్, ప్రమాద బీమా, రుణాలు, ప్రధాన మంత్రి మత్స్యయోజన కింద సబ్సిడీపై బోట్లు అందజేస్తున్నారని తెలిపారు.

గ్రామాల అభివృద్ధిపై శిక్షణ

నాగులుప్పలపాడు, అక్టోబరు 8: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు మంగళవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈవోఆర్డీ మురళీమోహన్ 2024-25 ఏడాదికి గ్రామ పంచాయతీల అభివృద్ధిపై కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.



సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకుంటాం

డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

'ఆంధ్రజ్యోతి' కథనంతో కలవరం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు(కార్పొరేషన్), అక్టోబరు 8: 'డ్వామాలో ఫర్నీచర్ రగడ' కథనంపై ప్రస్తుత పీడీ జి.జోసఫ్‌కుమార్ స్పందించారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన ఈ కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. గత పీడీ అర్జున్‌రావు ఇంటి కోసం ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో ఫర్నీచర్ కొనుగోలు చేసినట్లు తెలిపారు. అయితే ఇందుకు సంబంధించిన ఫైలు, రికార్డులు అన్నీ పరిశీలన కోసం సమర్పించాలని కోరినట్లు చెప్పారు. అదే విధంగా గత పీడీ అర్జున్‌రావును ఫర్నీచర్ కొనుగోలు వ్యవహారంపై వివరణ కోరామన్నారు. సమగ్రపరిశీలన చేసి, బాధ్యులైన వారిపై శాఖపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదిలా ఉండగా, మంగళవారం ప్రచురించిన కథనం ఫర్నీచర్ కొనుగోలులో బాధ్యులైన సిబ్బంది మల్లాగుల్లాలు పడుతున్నారు. ఈ వ్యవహారం నుంచి బయటపడేందుకు. పాత తేదీలతో రెండు, మూడు షాపుల నుంచి కొటేషన్లు తీసుకొచ్చినట్లుగా సమాచారం. ఈ వ్యవహారంలో గత పీడీ కోసం చూపిన స్వామి భక్తి చూపిన కొందరు సిబ్బంది ఆరోపణల నుంచి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే ఫర్నీచర్ కొనుగోలుతోపాటు, ఇక్కడ పీడీగా పనిచేసే సమయంలో అర్జునరావు అడ్వాన్సు కింద మూడు నెలలకు రూ.3.90 లక్షలు డ్రా చేసుకుని, తిరిగి వాటిని కార్యాలయానికి చెల్లించకుండానే బదిలీపై వెళ్ళినట్లు అధికారులు గుర్తించారు. దీంతో అవాక్కయిన కార్యాలయంలోని వాటర్‌షెడ్ అధికారులు ఇప్పటికే కొనుగోలు చేసిన రూ.6లక్షల ఫర్నీచర్, అడ్వాన్స్ రూ.3.90లక్షలు ఎలా రికవరీ చేయాలో దిక్కుతోచక అయోమయంలో పడ్డారు. మొత్తంగా ఆంధ్రజ్యోతిలో ప్రచురితనమైన కథనం జిల్లావ్యాప్తంగా డ్వామా సిబ్బందిలో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు గత పీడీ అడ్డగోలు వ్యవహారం, నిధులు దుర్వినియోగం, రికవరీపై చర్యలు తీసుకోనున్నారు.

ఇంజన్ మొరాయించడంతో నిలిచిన 'పినాకిని'

• పలు రైళ్లకు అంతరాయం


ఆగిన పినాకిని ఎక్స్‌ప్రెస్

చీరాలటౌన్, అక్టోబరు 8 : అకస్మాత్తుగా ఇంజన్ మొరాయించడంతో బాపట్ల జిల్లా కొత్త పందిళ్లపల్లి సమీపంలో చెన్నై నుంచి విజయవాడ వెళ్లే పినాకిని ఎక్స్‌ప్రెస్ అర్ధంతరంగా ఆగిపోయింది. 7:45కు చీరాలకు చేరాల్సి ఉండగా రాత్రి 8 గంటల సమయంలో కొత్త పందిళ్లపల్లి సమీపంలో ఆగిపోయింది. సుమారు రెండు గంటలపాటు కదల్లేదు. అయితే అధికారులు విజయవాడ నుంచి మరో ఇంజన్‌ను తెప్పించడంతో రాత్రి 10 గంటల సమయంలో బయలుదేరింది. ఈ నేపథ్యంలో అనేక రైళ్లు ఆలస్యంగా నడిచాయి. కాగా పినాకిని ఆగిపోవడంతో చీరాల, సమీప గ్రామాలకు చెందిన ప్రయాణికులు రైలు దిగి ఆటోలకు వెళ్లిపోయారు. అయితే దూరప్రాంతాలకు వెళ్లాల్సిన వారు, విజయవాడ నుంచి మరో రైలుకు బుక్ చేసుకున్న వారు ఇబ్బందులు పడ్డారు.

బేల్దారి మేస్త్రి ఆత్మహత్య

చీమకుర్తి, అక్టోబరు 8 : మండలంలోని తొర్రగుడిపాడు గ్రామంలో బేల్దారి మేస్త్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. గుంటూరు జిల్లాకు చెందిన గంగాధర్ అనే వ్యక్తి గత కొంతకాలంగా తన రెండో భార్యతో గ్రామంలో నివసిస్తూ బేల్దారి మేస్త్రిగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా కుటుంబకలహాలతో రెండో భార్య కూడా అతన్ని విడిచి వెళ్లిపోవటంతో మనస్తాపానికి గురైన గంగాధర్ తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని చనిపోయి ఉంటాడని పోలీసుల భావిస్తున్నారు. మృతదేహాన్ని సీఐ సుబ్బారావు పరిశీలించారు. కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నామని ఆయన తెలిపారు.

వార్డుసభ్యులకు అవగాహన సదస్సు

సంతనూతలపాడు, అక్టోబరు 8: సంతనూతలపాడులోని మండలపరిషత్ కార్యాలయంలో వార్డుమెంబర్, ఉపసర్పంచ్‌లకు మంగళవారం ఈవోఆర్డీ రమణమ్మ శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంపీపీ బీవీజయ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తాగునీరు, పారిశుధ్యం, మొదలైన సమస్యలపై అవగాహన కల్పించారు. గ్రామాల అభివృద్ధిలో పాలుపంచుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పేద మహిళకు తోపుడు బండి అందజేత


కూరగాయల బండిని అందజేసిన సభ్యులు

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 8: పేర్నమిట్టలో నివసిస్తున్న పేద మహిళ అంజమ్మ జీవనోపాధికి సూర్యశ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్ట్ తోపుడు బండిని, కూరగాయలను అందజేసింది. అంజమ్మ తన ముగ్గురు పిల్లలతో జీవనం కష్టంగా మారడంతో ప్రస్తుతం బేల్దారి పనికి వెళ్తుండగా అక్కడ జరిగిన ప్రమాదం వల్ల ఆ పని మానుకుందని ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్ బాషా తెలిపారు. దీంతో ఆమె ట్రస్ట్‌ను ఆశ్రయించగా ఎంఎస్‌డి సుబ్బు సహకారంతో తోపుడు బండి, కూరగాయలు ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం స్థానిక ట్రస్ట్ కార్యాలయం వద్ద ఆమెకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో జనసేవ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనా విభావరి


గానం చేస్తున్న మురళీకృష్ణ

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 8: ఒంగోలు నగరం కేశవస్వామిపేట శ్రీలలితాశ్రమంలో మంగళవారం రాత్రి ఏర్పాటుచేసిన అన్నమయ్య సంకీర్తనా విభావరి భక్తులను విశేషంగా అలరించింది. ప్రముఖ గాయకులు ఇనమనమెళ్లూరి మురళీకృష్ణ పలు అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. అన్నమాచార్య సంకీర్తనలకు ఆయన వ్యాఖ్యానం చేశారు. ఈ సందర్భంగా లలితాశ్రమ నిర్వాహకురాలు విజ్ఞానానంద సరస్వతీ మాతాజీ అమ్మవారి శేషవస్త్రంతో మురళీకృష్ణను సన్మానించి ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో తబలాపై శ్రీనివాస్, కీబోర్డుపై ఎస్‌కే.బాబులు వాద్యసహకారాన్ని అందజేశారు.

గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

మద్దిపాడు, అక్టోబరు 8: గ్రామ అభివృద్ధిలో వార్డుసభ్యులు భాగస్వాములు కావాలని ఎంపీపీ అరుణ కోరారు. మంగళవారం మద్దిపాడులో వార్డు సభ్యులకు శిక్షణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్‌ప్రసాద్, టీవోటీ శ్రీకాంత్, ఆశాలక్ష్మి, ఎంపీటీసీ కోటిరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొమరోలు పంచాయతీ కార్యదర్శిగా బ్రహ్మయ్య

కొమరోలు, అక్టోబరు 8 : కొమరోలు పంచాయతీ కార్యాదర్శిగా దేవరశెట్టి బ్రంహ్మయ్య బాధ్యతలు చేపట్టారు. బ్రహ్మయ్య కంభం పంచాయతీ కార్యాదర్శిగా పనిచేస్తూ బదిలీపై కొమరోలు గ్రామ పంచాయతీ కార్యాదర్శిగా వచ్చారు.



కాత్యాయనీదేవిగా బాలాత్రిపుర సుందరీదేవి


కాత్యాయనీ అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

త్రిపురాంతకం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారు మంగళవారం సింహ వాహనంపై కాత్యాయనీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈసందర్భంగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి, చిన్నమస్తాదేవికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. రాత్రికి అమ్మవారికి సింహవాహనంపై అలయ ఉత్సవం నిర్వహించారు. అనంతరం పరాకులు, పవలింపుసేవ నిర్వహించారు. అమ్మవారు బుధవారం కాళరాత్రి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

● మార్కాపురం వన్‌టౌన్ : దసరా శరన్నవరాత్రులు మార్కాపురం పట్టణంలో వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మీ అమ్మవారి సంతానలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శివాలయంలో జగదాంబ కాత్యాయని అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వాసవి కాన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

● పెద్దదోర్నాల : దేవి నరవరాత్రుల్లో భాగంగా స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో అమ్మవారు మంగళవారం శ్రీలలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మోట్ల మల్లికార్జునపురంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం, తిమ్మాపురంలోని శ్రీ చౌడేశ్వరీ దేవాలయంలో శ్రీ మహాలక్ష్మీ అలంకారంలో దర్శనమిచ్చారు.


● గిద్దలూరు : దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో మంగళవారం అమ్మవారు పార్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

● కంభం : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు పార్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 9గంటలకు దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్రెండ్స్‌ఈవెంట్స్ అలరించాయి

● పొదిలి : కంభాలపాడులోని అంకాలపరమేశ్వరి దేవి మంగళవారం మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పలువురు ఉభయదాతలు కాయ కర్పూరం, చీర, సారెలతో నైవేద్యం సమర్పించి దర్శించుకున్నారు.

కొమరోలులో దోవిందుడి గ్రామోత్సవం

కొమరోలు : కొమరోలులో గోవిందుడిని గ్రామోత్సవం నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ ధర్మకర్త దేవర రమేష్ ఆధ్వర్యంలో భక్తులకు బస్సు ఏర్పాటు చేశారు. అన్నదానం నిర్వహించారు.





ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



గిద్దలూరు టౌన్, అక్టోబరు 8 : ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన జన్మదినం సందర్భంగా మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లో.. నియోజకవర్గ కేంద్రమైన గిద్దలూరుకు తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి వీలుగా గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలోనే గుండ్లమోటు నుంచి గిద్దలూరుకు ప్రత్యేక పైపులైన్ వేయించి చిన్నపాటి ప్రాజెక్టుకు రూపకల్పన జరిగింది. దానివల్ల గడిచిన ఐదేళ్లలో పట్టణంలోని చాలా ప్రాంతాలకు నీటి సమస్య పరిష్కారమైంది. రామన్నకతువ నుంచి గిద్దలూరుకు నీటిని మళ్లించే రూ.80 కోట్ల తాగునీటి ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయించి పనులు మొదలు పెట్టాం. సిమెంటు రోడ్ల నిర్మాణం, మురికి కాలువల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. గిద్దలూరులో పార్కుల అభివృద్ధి, కొత్త పార్కుల ఏర్పాటు, శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారం, వందశాతం సిమెంటు రోడ్ల నిర్మాణం, శివారు ప్రాంతాల్లో మురుగునీటి కాలువల నిర్మాణం, ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించి ఆ మేరకు నిధుల మంజూరు కోసం పెద్ద ఎత్తున ప్రయత్నాలు మొదలుపెట్టాం. 90 శాతం నిర్మాణాలు పూర్తయి వైసీపీ పాలనలో మూలనపడ్డ 1400 టిడ్కో గృహాలను త్వరితగతిన పూర్తి చేయించి గృహప్రవేశాలు చేయించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. చెరువులు, పంట కాలువల అభివృద్ధిపై ఇప్పటికే సమీక్షలు నిర్వహించాం. మొత్తం మీద సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో పని చేస్తున్నాం అని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పేర్కొన్నారు.



అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పెద్దారవీడు, అక్టోబరు 8 : అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సిద్దినాయునిపల్లిలో జరిగింది. సిద్దినాయునిపల్లికి చెందిన రుద్రపాటి చిన్న వెంకట చెన్నయ్య తన ఐదెకరాల్లో వ్యసాయం చేస్తున్నాడు. పెద్దారవీడు ఎస్‌బీఐలో రూ.2.15 లక్షలు, ప్రైవేటుగా రూ.8 లక్షలు అప్పు చేశాడు. పంటలపై రాబడి లేకపోవడం, అప్పులోళ్ల ఒత్తిడి తీవ్రమువడంతో మనస్థాపానికి గురైన వెంకట చెన్నయ్య మంగళవారం ఉదయం పొలానికి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై అనిల్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూసారాన్ని పెంచుకోవాలి

గిద్దలూరు : భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడుకుని భూసారాన్ని పెంచుకోవచ్చని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తకోట, తంబళ్లపల్లి గ్రామాల పరిధిలో సాగులో ఉన్న కంది, పత్తి పంటలను 'పొలంబడి'లో భాగంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

'అలుగు' నిందితుల అరెస్టు

పెద్ద దోర్నాల, అక్టోబరు 8 : వన్యప్రాణి పంగోలిన్ (అలుగు)ను పట్టి విక్రయిస్తున్న నిందితులను అరెస్టు చేసినట్లు ఎఫ్ఎస్‌వో షేక్ మునీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.


కోర్టుకు హాజరైన నిందితులు

సుందరయ్య కాలనీకి చెందిన మంద బాబూరావు, జమ్మిదోర్నాల గ్రామానికి చెందిన చాట్ల దానమయ్య, కొత్తూరు గ్రామానికి చెందిన పెద్దన్నను అరెస్టు చేశారు. ఎఫ్ఎస్‌వో షేక్ మునీర్ తెలిపిన కథనం ప్రకారం చిలకచెర్ల బోడు గూడేనికి చెందిన దాసరి బుడ్డన్న ఈనెల 5వ తేదీన పంగోలిన్ (అలుగు)ను వేటాడి పట్టి, పెద్దారవీడు మండలం ప్రగళ్లపాడు గ్రామానికి చెందిన కుడుముల బయన్న కు సమాచారమిచ్చాడు. ఇద్దరూ కలిసి మధ్యవర్తుల ద్వారా చిన్నగుడిపాడు వద్ద ఉన్న ఆర్‌డీటీ కార్యాలయం సమీపంలో విక్రయించేందుకు సిద్ధమయ్యారు. విశ్వసనీయ సమాచారంతో అటవీ శాఖాధికారులు అప్రమత్తమై సిబ్బందితో దాడులు నిర్వహించారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా వాస్తవమని నిర్ధారణకు రావడంతో అరెస్టు చేసి మార్కాపురం కోర్టుకు హాజరు పరిచారు. పంగోలిన్‌ను పట్టిని దాసరి బుడ్డన్న, కుడుముల బయన్న పరారీలో ఉన్నట్లు అటవీ శాఖాధికారి మునీర్ చెప్పారు.

అక్రమ ధ్రువపత్రాల మంజూరుపై చర్యలు

మార్కాపురం రూరల్ : మండలంలోని గజ్జలకొండలో వివాదాస్పదంగా ఉన్న గ్రామ కంఠానికి చెందిన స్థలాన్ని తహసీల్దార్ చిరంజీవి మంగళవారం పరిశీలించారు. గ్రామ కంఠానికి చెందిన స్థలాన్ని కొందరు వ్యక్తులకు నిబంధనలకు విరుద్ధంగా ధ్రువపత్రాలు మంజూరు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లాస్థాయి అధికారులకు నివేదిక పంపుతున్నట్లు తెలిపారు.



















పునరుద్ధరణ పనులను పరిశీలించిన ఉగ్ర

కనిగిరి, అక్టోబరు 8 : కనిగిరి ప్రాంతంలో తాగునీటి ఎద్దడి నివారణకు రామతీర్థం పైపులైను పనుల పునరుద్ధరణకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో చినారికట్ల వద్ద పంప్ హౌస్‌ను మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. సాగర్ నీరు దర్శి కెనాల్ నుంచి చినారికట్ల పంప్‌హౌస్ ద్వారా కనిగిరి మున్సిపాలిటీకి సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు. చినారికట్ల పంప్ హౌస్‌లోని మోటర్లు, పైప్ పనులు చేపడుతున్నారు.

భక్తిశ్రద్ధలతో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

దర్శి, అక్టోబరు 8 : మండలంలో దేవిశరన్నవరాత్రుల ఉత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. మంగళవారం అమ్మవారు లలితాదేవి రూపంలో దర్శనమిచ్చి పూజలందుకున్నారు.

పామూరులో...

పామూరు అక్టోబరు, 8 : స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానంలో మంగళవారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయంలో గణపతి, కలశపూజ, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి అమ్మవారికి పలు పూజలు చేశారు.

పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన అవసరం

తాళ్లూరు, అక్టోబరు 8 : పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎంపీపీ శ్రీనివాసరావు చెప్పారు. ఎంపీపీ కార్యాలయ హాలులో ఉపసర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. జడ్పీటీసీ వెంకటరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో సానికొమ్ము సత్యం, ఈవోఆర్‌డీ సుందరరామయ్య మాట్లాడారు. ముందుగా గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు.

మారెళ్ల సచివాలయంలో చోరీ

ముండ్లమూరు, అక్టోబరు 8 : మండలంలోని మారెళ్ల గ్రామ సచివాలయంలో మంగళవారం వేకువన తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న ఒక కంప్యూటర్, మూడు సీపీయూలు, ఒక మానిటర్‌ను ఎత్తుకుపోయారు. దీనిపై కార్యదర్శి రాధాకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ నాగరాజు కేసు నమోదు చేశారు.

మద్యం పాలసీని గట్టిగా అమలు చేస్తాం

కనిగిరి, అక్టోబరు 8 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీ విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని ఎక్సైజ్ మార్కాపురం ఏఈఎస్ దాసరి బాలయ్య చెప్పారు. ఈనెల 6న ఆంధ్రజ్యోతిలో 'మాప్రాంతానికి మావారే' అనే కథనం ప్రచురితమైన నేపథ్యంలో మార్కాపురం పరిధిలోని ఎక్సైజ్ కార్యాలయాలను ఆయన సందర్శించారు. మంగళవారం కనిగిరి ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మార్కాపురం పరిధిలోని 68 షాపులకు 425 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. బుధవారంతో గడువు ముగుస్తుందన్నారు. కనిగిరి రూరల్ పరిధిలోని 123, 124, 125 షాపులకు కేవలం ఐదు దరఖాస్తులే వచ్చాయని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలని ఏఈఎస్ సూచించారు.


గాయపడిన యువకుడు మృతి

ముండ్లమూరు, అక్టోబరు 8 : మండలంలోని శంకరాపురం వద్ద సోమవారం రాత్రి ఆటోను ఢీకొని తీవ్రంగా గాయపడిన దర్శి మండలం పాపిరెడ్డిపాలేనికి చెందిన ద్విచక్ర వాహనచోదకుడు లక్కు. రవీంద్రారెడ్డి(27) మంగళవారం తెల్లవారు జామున ఒంగోలులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు తండ్రి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ఎస్‌ఐ వై నాగరాజు పరిశీలించారు.









బదిలీలు.. బేఖాతర్

- అభాసుపాలైన ప్రక్రియ
- ఇంకా కొలువు వీడని అధికారులు
- జీవో ఇచ్చి చేతులు దులుపుకున్న ప్రభుత్వం
- పలు మున్సిపాల్టీలో సీట్లు వీడకుండా ఇష్టారాజ్యం
- విధుల్లో చేరొద్దని అధికారపార్టీ నేతల బెదిరింపులు
- రాజకీయ అండతో ఉత్తర్వులను లెక్కచేయని వైనం



బదిలీల ప్రక్రియ ముగిసి రెండు వారాలు అవుతుంది. అయినా ఇంకా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో కింది స్థాయి ఉద్యోగుల నుంచి కీలక అధికారుల వరకు సీట్లు వదల్లేదు. బదిలీలకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులను ఆయా అధికారులు, ఉద్యోగులు పట్టించుకోవడంలేదు. కోరుకున్న సీటు.. ఆశించిన ప్రాంతానికి తమను బదిలీ చేయలేదని పలువురు మొండికేస్తున్నారు. వీరికి ఆయా ప్రాంతాల్లోని ఉన్నతాధికారులు, రాజకీయ నేతలు అండతో బదిలీ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం చేపట్టిన బదిలీ ప్రక్రియ అభాసుపాలైంది. జీవోలను చిత్తు కాగితాల్లా భావిస్తూ కొందరు అధికారుల బరితెగించి వ్యవహరిస్తున్నారు. కొన్ని చోట్ల బదిలీపై వచ్చిన అధికారులను విధుల్లో చేరకుండా అధికార పార్టీ నేతలు అడ్డుకుంటున్నారు. బదిలీ అయిన వారు సీట్లు వీడకపోవడం.. మరికొన్ని దగ్గర్ల బదిలీపై వచ్చిన వారిని అడ్డుకోవడంతో పరిపాలనా ప్రక్రియ స్తంభించిపోయింది. ప్రధానంగా మున్సిపాల్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల్లో ఈ పరిస్థితి నెలకొనడంతో వివిధ సమస్యలపై వచ్చే వారికి సమాధానం చెప్పేవారు లేకుండా పోతున్నారు. జీవోతో సరిపెట్టిన ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అవి అమలవుతున్నాయో లేదో పరిశీలించకపోవడంపై ప్రజల నుంచి కూడా విమర్శలు వస్తున్నాయి. పేరుకే బదిలీలని అమలు నామమాత్రంగా కూడా లేదని చెప్పవచ్చు.


బాపట్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గత నెల 23వ తేదీతో బదిలీల ప్రక్రియ ముగిసింది. అయితే ఇంతవరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని ముఖ్యమైన శాఖల్లో కూడా చాలావరకు బదిలీలు అమలు కాలేదు. బదిలీలకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులను కొందరు అధికారులు లక్ష్యపెట్టడంలేదు. జీవోను అమలు చేయాల్సిన కొందరు అధికారులు అధికార పార్టీ నేతలు చెప్పినదానికల్లా తలాడిస్తూ బదిలీల ప్రక్రియను భేఖాతరు చేస్తున్నారు. కొన్ని చోట్ల బదిలీపై వచ్చిన అధికారులను విధుల్లో చేరవద్దని వారిపై స్థానంలోని అధికారులు తిరస్కరిస్తుండటం గమనార్హం. బదిలీల ప్రక్రియ ముగిసి రెండు వారాలు దాటినా ఇంకా నాలుగో వంతు మంది అధికారులు, ఉద్యోగులు వారికి కేటాయించిన స్థానాల్లో బాధ్యతలు స్వీకరించలేదని సమాచారం. బదిలీ చేసినా పలువురు ఉన్న చోటును వీడకుండా తిష్టవేసి కూర్చున్నారు. మున్సిపల్ పరిపాలనా శాఖలో బదిలీల ప్రక్రియ అస్తవ్యస్తంగా ఉంది. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల్లో ఇంకా చాలామంది ఉద్యోగులు, అధికారులు వారికి కేటాయించిన పోస్టుల్లో బాధ్యతలు స్వీకరించలేదు. దీనినిబట్టి బదిలీలకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులను ప్రభుత్వ అధికారులే అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితి తెలిసి కూడా బదిలీ ఉత్తర్వులను విడుదల చేసి ఉన్నతాధికారులు కూడా తమకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. గత నెల 23తో బదిలీల ప్రక్రియ పూర్తయినా వారికి కేటాయించిన పోస్టుల్లో చేరని వారిపై చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలున్నాయి. దీంతో కొందరు అధికారులు రాజకీయ అండదండలతో రెచ్చిపోతున్నారు.

బదిలీ అయినా పైరవీలు..

కోరుకున్న చోట పోస్టింగ్ రాని పంచాయతీ కార్యదర్శులు కొన్ని చోట్ల విధుల్లో చేర కుండా రాజకీయ పైర వీలు చేస్తున్నారు. దీంతో చాలా పంచాయతీల్లో కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే కార్యదర్శుల గ్రేడుల్లో కూడా గందరగోళం నెలకొంది. రెవెన్యూ శాఖలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. వీఆర్‌వోల బదిలీలు కూడా ఇంకా పూర్తి స్థాయిలో అమలు కాలేదు. బదిలీ అయిన వీఆర్‌వోలు కొందరు ఇంకా రిలీవ్ కాకుండా అక్కడే తిష్ట వేసుక్కూర్చున్నారు. బదిలీల ప్రక్రియ నిర్వహించిన ఉన్నతాధికారులు రిలీవ్ కాని వీఆర్‌వోలపై చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారన్న విమర్శలున్నాయి. కోరుకున్న పోస్టింగ్ కోసం వీఆర్‌వోలు అధికార పార్టీ నేతలతో పైరవీలు సాగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కోరుకున్న ప్రాంతం దక్కని అధికారులు డిప్యూటేషన్ల బాటలో పయనిస్తున్నారు. అధికార పార్టీ నేతల అండదండలతో సదరు అధికారులు పైరవీలు చేస్తున్నారు. డిప్యూటేషన్ ఉత్తర్వుల కోసం ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. సత్తెనపల్లి మున్సిపాల్టీ నుంచి నరసరావుపేటకు, నరసరావుపేట నుంచి సత్తెనపల్లి మున్సిపాల్టీకి డిప్యూటేషన్లపై అధికారులను మార్చేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే నరసరావుపేట మున్సిపాల్టీలో ఓ అధికారిని విధుల్లో చేర్చుకోలేదన్న ప్రచారం జరుగుతుంది. టిడ్కోలో కూడా బదిలీలు జరిగాయి. సదరు అధికారుల్లో కొందరు ఇంకా రిలీవ్ కాలేదు.

బదిలీకి ససేమిరా

గడచిన ఐదేళ్ల పాలనలో వైసీపీతో అంటకాగిన అధికారులు, ఉద్యోగులు చాలామందికి బదిలీ ఉత్తర్వులు వచ్చినా వెళ్లడానికి ఇష్టపడటంలేదు. కూటమి నేతలను ప్రసన్నం చేసుకుని తిరిగి కొనసాగేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. బాపట్లలో వైద్య ఆరోగ్య శాఖ విభాగంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగికి పొరుగు జిల్లాకు బదిలీ కాగా ఇప్పటికీ ఆయన రిలీవ్ కాకుండా పాత పోస్టులోనే కొనసాగుతున్నారు. అదేవిధంగా డిప్యూటేషన్‌మీద బాపట్ల జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని భట్టిప్రోలు మండల పరిధిలోని జడ్పీ హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. కానీ ఇప్పటికీ అదే పోస్టులో సదరు ఉద్యోగి కొనసాగుతున్నారు. పైగా అక్కడే కొనసాగడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలో కొందరు బదిలీ ఉత్తర్వులు వచ్చినా వెళ్లడానికి ఇష్టపడక రాజకీయ పైరవీల కోసం తిరుగుతూ ఉన్నారు. ఆర్‌అండ్‌బీ విభాగంలో కూడా చాలా వరకు ఇదే రకమైన పరిస్థితి నెలకొంది.



బదిలీల ప్రక్రియ అభాసుపాలైందనడానికి కొన్ని ఉదాహరణలు..

- మాచర్ల మున్సిపాల్టీలో కమిషనర్, ఇంజనీర్ల పోస్టులు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. ఈ పోస్టులకు నియామకాలు జరిగినా సదరు అధికారులు ఇక్కడకు వచ్చేందుకు ఇష్టపడక విధుల్లో చేరకుండా డుమ్మా కొడుతున్నారని సమాచారం. ఆయా అధికారులు విధుల్లో చేరకపోయినా వారిని ప్రశ్నించే వారే లేకుండాపోయారు. ఈ పరిస్థితుల్లో ఇక్కడ పురపాలన స్తంభించి ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు.
- గుంటూరు కార్పొరేషన్‌లో పలువురు ఇంజనీర్లను బదిలీ చేశారు. వీరిలో కొందరు ఇంకా వారి సీట్లలోనే తిష్ట వేసుకుకూర్చొన్నారు. విధుల నుంచి రిలీవ్ అయ్యేందుకు వారు ఇష్టపడటం లేదు. ఇంజనీరింగ్ విభాగంలో ఇద్దరికి ఉద్యోగోన్నతులు లభించినా వెళ్లేదిలేదని ఇక్కడే పనిచేస్తామంటూ రాజకీయ అండదండలతో వారు విధుల నుంచి రిలీవ్ కానట్లు తెలిసింది. మరో ఇద్దరు ఇంజనీర్లది కూడా ఇదే పరిస్థితి.
- నరసరావుపేట మున్సిపాల్టీ ప్రణాళికా విభాగంలో ఓ అధికారిని నియమించారు. సదరు అధికారి విధుల్లో చేరేందుకు వస్తే కమిషనర్ అంగీకరించలేదు. దీంతో ఆ అధికారి గాలిలో ఉన్నారు. కీలకమైన ప్రణాళికా విభాగంలో పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. ఇంజనీరింగ్ విభాగంలో ఏఈ బదిలీ అయినా ఇంకా ఇక్కడే కొనసాగుతున్నారు. కమిషనర్ సదరు అధికారిని రిలీవ్ చేయలేదని తెలిసింది. ఇక్కడ నియమితులైన ఏఈ విధుల్లో చేరకపోవడం గమనార్హం.
- పిడుగురాళ్ల మున్సిపాల్టీలోని ఓ అధికారిని గురజాల మున్సిపాల్టీకి ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించారు. గురజాలకి ఇంకా డీఈని నియమించలేదు. నరసరావుపేట, సత్తెనపల్లి, వినుకొండ మున్సిపాల్టీలలో ముగ్గురు అధికారులను సొంత జీతం విధానంతో ఇతర మున్సిపాల్టీలకు కమిషనర్లుగా నియమించారు. ఆయా మున్సిపాల్టీలో ఆ మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని రెగ్యులర్‌గా నియమించే పరిస్థితి లేదని డిప్యూటేషన్‌పై నియమించాల్సి ఉన్నట్లు చెబుతున్నారు. ఇలా సొంత జీతం విధానంలో బదిలీపై వెళుతున్న అధికారుల స్థానంతో కొత్తవారిని నియమించే విషయంలో మున్సిపల్ పరిపాలన విభాగం పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తోంది. దీంతో కొన్ని మున్సిపాల్టీల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- తెనాలికి ఓ మున్సిపల్ ఇంజనీరును బదిలీ చేశారు. ఆయనను కూడా అక్కడి కమిషనర్ విధుల్లో చేర్చుకోలేదు.



మధ్యాహ్న భోజనం.. ప్రక్షాళన

- పథకంలో మార్పులపై విద్యాశాఖ కసరత్తు
- విద్యార్థులందరూ భోజనం చేసేలా ప్రణాళిక
- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల సూచనలు పరిగణనలోకి

గుంటూరు(విద్య), అక్టోబరు 8: మధ్యాహ్న భోజనం.. పాఠశాలల్లో విద్యార్థులు కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో తింటున్నారు. మరికొందరు వదిలేస్తున్నారు. ఇంకొందరైతే అసలు బడి భోజనం తినకుండా ఇళ్ల నుంచే తెచ్చుకుంటున్నారు. దుడ్డు బియ్యంతో అన్నం.. రుచితో పాటు ఇష్టపడిన కూరల కారణంగానే విద్యార్థులు బడి భోజనంపై అయిష్టత చూపుతున్నట్లు ఎప్పటి నుంచో ఉంది. అయితే దీనిపై అటు అధికారులు, ఇటు ప్రభుత్వం పట్టించుకోకుండా మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేస్తూ వస్తుంది. బడిలోని పిల్లలందరూ ఇష్టంగా బడిలో భోజనం చేసేలా కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం ప్రక్షాళనకు కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో భారీ మార్పులు చేసేలా విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా భారీ మార్పులకు సిద్ధమైంది. గత ప్రభుత్వ హయంలో అస్తవ్యస్తమైన మధ్యాహ్నభోజన పథకాన్ని గాడిలో పెట్టేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 4300, ఉన్నత పాఠశాలలు 345కిపైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు 6.45 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. అయితే ఇందులో దాదాపు 20 నుంచి 35 శాతం వరకు విద్యార్థులు వివిధ కారణాలతో మధ్యాహ్న భోజనం చేయడం లేదు. ఆయా కారణాలు గురించి విద్యాశాఖ నివేదిక రూపంలో గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. అయినా ఫలితం లేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తాజాగా ఇటీవల కలెక్టర్ స్థాయిలో సమీక్ష నిర్వహించింది. పాఠశాలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్యకు భోజనం తీసుకునే విద్యార్థుల సంఖ్యకు మధ్య ఉన్న వ్యత్యాసాలు తొలగించడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇటీవల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల నుంచి బడి భోజనం బాగుండేందుకు ప్రభుత్వం సూచనలు కోరింది. పలు కమిటీలు వివిధ సూచనలు చేయగా వాటిని పరిగణనలోకి తీసుకుని పథకంలో మార్పులకు ప్రభుత్వం సిద్ధమైంది.

పథకంలో మార్పులపై కమిటీల సూచనలు..

- మధ్యాహ్న భోజనం పథకానికి బడ్జెట్ పెంచాలి. పోర్టిఫైడ్ బియ్యం పేరుతో సరఫరా చేస్తున్న లావు బియ్యం స్థానంలో సన్న బియ్యం ఇవ్వాలి.
- రోజువారీ మెనూలో అందించే చింతపండు పులిహోర బదులు లెమన్ రైస్ ఇస్తే విద్యార్థులు ఇష్టంగా తినే అవకాశం ఉంది. పొంగలి కూడా తినడంలేదు. దీనిలోకూడా మార్పులు చేయాలి.
- ఉదయం ఇచ్చే రాగిజావలో నాణ్యత ఉండటం లేదు. దానికి ప్రత్యామ్నాయంగా రాగితో చేసిన చిక్కీలు, లడ్డూలు లేదా పాలివ్వాలి.
- మంగళగిరి, తెనాలి, తాడికొండ తదితర నియోజక వర్గాల్లో అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించే మధ్యాహ్నభోజనం సాంబరుతో కలిపి ఇస్తున్నారు. ఇలా కాకుండా వైట్‌రైస్ సాంబారు విడివిడిగా ఇవ్వాలి.
- అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేసే మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లు ఇవ్వడం లేదు. ఇందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి కోడిగుడ్లు సరఫరా చేయాలి.
- ఏజెన్సీలు గుడ్డు ఉడకపెట్టి పెంకు తీసి ఇస్తున్నాయి. దానిని విద్యార్థులు ఇష్టపడటం లేదు. గుడ్లు విద్యార్థులకే ఇస్తే వారే పెంకు తీసుకుని తినేలా ఏర్పాట్లు చేయాలి.
- ప్రతి శనివారం అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే మధ్యాహ్న భోజన పథకంలో ఇచ్చే స్వీట్‌ను ప్రసాదంగా భావించి పలువురు తినడం లేదు. దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.
- ఏజెన్సీలకు ఏ నెలకానెల బిల్లులు చెల్లించడంలేదు. అప్పులు చేయాల్సి వస్తుంది. నెలనెలా బిల్లులు ఇస్తే ఏజన్సీలకు అప్పుల బాధ తప్పుతుంది.

అందరి సహకారంతోనే అభివృద్ధి

- స్వర్ణాంధ్ర ప్రణాళికపై చర్చలో మంత్రులు గొట్టిపాటి, అనగాని



సమీక్షలో మంత్రులు గొట్టిపాటి, అనగాని, ఎమ్మెల్యేలు, కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అందరి సహకారం తోనే స్వర్ణాంధ్ర 2047 సాధ్యపడుతుందని మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ తెలిపారు. స్వర్ణాంధ్ర ప్రణాళికపై మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో జరిగిన సమీక్షలో మంత్రులు మాట్లాడారు. గడచిన ఐదేళ్లలో జిల్లా అన్నివిధాలుగా తిరోగమనబాటలో పయనించిందని, దానిని చక్కదిద్దుకుని అభివృద్ధిపై పరిగెత్తించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గతంలో విజన్ 2020 ద్వారా అద్భుతమైన ఫలితాలు రాబట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిదని అనగాని సత్యప్రసాద్ గుర్తుచేశారు. భావితరాలకు మంచి భవిష్యత్ ఇవ్వడానికి స్వర్ణాంధ్ర సాకారదిశగా అడుగులేయాలని కోరారు. ఆక్వా, టూరిజం ఇలా అన్నిరంగాలలో జిల్లాను అగ్రగామిగా నిలపడానికి తమవంతు ప్రయత్నం చేస్తామన్నారు. దేశాన్ని అగ్రపథంలో నిలపడానికి చేస్తున్న ప్రయత్నంలో భాగంగా జిల్లా నుంచి మన భాగస్వామ్యం కూడా ఉండాలనే ఆలోచనతోనే ఈ సమావేశం నిర్వహించినట్లు గొట్టిపాటి తెలిపారు. నిరుపయోగంగా ఉన్న బకింగ్‌హాం కెనాల్‌ను అభివృద్ధిచేయాలని నిర్ణయించామన్నారు. వ్యవసాయ అనుబంధరంగాల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. చిన్నతరహా పరిశ్రమలను మరింతగా ప్రోత్సహించి యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా కల్పించే ప్రణాళికలపై దృష్టిసారించాలన్నారు. తలసరి ఆదాయంలో వందశాతం వృద్ధిరేటు సాధించడానికి లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. చీరాలలో చేనేతకు, అద్దంకి పరిధిలో షైనింగ్, పాలిషింగ్ కటింగ్ పరిశ్రమలకు మరింత తోడ్పాటునందించి జిల్లాను అన్ని రంగాల్లో పురోగమిం పజేస్తామన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పరిష్కరించాల్సిన సమస్యల చిట్టాను ఎమ్మెల్యేలు సమావేశంలో చర్చకు పెట్టారు. ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, కొండయ్య, వేగేశన నరేంద్రవర్మ సమీక్ష కు హాజరయ్యారు. గత ప్రభుత్వంలో కాల్వల్లో పూడిక తీయకపోవ డంతో చివరి ఆయకట్టు రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమ స్య ప్రధానంగా చర్చకు వచ్చింది. పర్యాటకరంగంతోపాటు చేనేత కార్మికులను ఆదుకోవడానికి కార్యాచరణ సిద్ధంచేయాలని ఎమ్మెల్యేలు కోరారు

సమస్యల ఏకరువు.. తక్షణ స్పందన

సమీక్ష అనంతరం మంత్రుల దృష్టికి వివిధ సమస్యలను ప్రజలు అర్జీల రూపంలో తీసుకొచ్చారు. ఈపూరుపాలెం గ్రామ పరిధిలో స్టూవర్టుపురం చానల్ నుంచి పంట కాల్వల ద్వారా దిగువ పొలాలకు నీటిని రాకుండా కొందరు అడ్డుకుంటున్నారని అనగాని దృష్టికి రైతులు తీసుకురాగా చీరాల ఆర్డీవో అభిలను పిలిచి సమస్యకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. అద్దంకి మండలం మైలవరంలో చెరువు అన్యాక్రాంతమైనట్లు రవికుమార్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేయగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్వర్ణాంధ్ర 2047 వ్యాస రచనలో ప్రతిభ చూపిన విద్యార్థులను మంత్రులు అభినందించారు.

బాబ్బాబు.. దరఖాస్తు చేయండి

- లక్ష్యాలపై ఎక్సైజ్ అధికారుల్లో టెన్షన్
- జిల్లాలో 8 దుకాణాలకు సున్నా స్పందన
- దరఖాస్తులకు నేటితో ముగియనున్న గడువు



బాపట్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువు బుధవారంతో ముగియనుంది. అయితే మద్యం షాపులకు దరఖాస్తుల విషయంలో నిర్దేశించిన లక్ష్యాలకు, వచ్చిన వాటికి పొంతన లేదు. మంగళవారం సాయంత్రం వరకు 1050 వరకు దరఖాస్తులు రాగా ఇంకా ఒక్కటి కూడా రాని షాపులు జిల్లాలో 8 వరకు ఉన్నాయి. జిల్లాలో 2,300 వరకు దరఖాస్తులు రావాలని ఎక్సైజ్ శాఖకు ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో సగం కూడా దరఖాస్తులు రాకపోవడంతో ఎక్సైజ్ శాఖ ఒత్తిడిని ఎదుర్కొంటోంది. తక్కువగా స్పందన ఉన్న షాపులతో పాటు జీరో దరఖాస్తుల విషయంలో పై అధికారుల నుంచి వస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పుకోలేక యంత్రాంగం తలలు పట్టుకుంటోంది. షాపుల గురించి వివరాలు అడిగి వెళ్లిన వారికి కూడా ఎక్సైజ్ సిబ్బందే ఫోన్ చేసి మరీ దరఖాస్తు చేయడానికి ఆహ్వానిస్తున్నారంటే వారి మీద ఉన్న ఒత్తిడి ఏ స్థాయిలో అర్థం చేసుకోవచ్చు. ఎవరైనా రాజకీయంగా సిండికేట్ అవడం వల్ల దరఖాస్తులు రావడం లేదా అనే కోణంలో కూడా విచారణ జరిపి అక్కడ ఆశావహులకు భరోసా కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. దరఖాస్తు ఫీజు ఎక్కువగా ఉండడంతో రూరల్ ప్రాంతాల్లో స్పందన తక్కువగా ఉన్నట్లు సమాచారం. భట్టిప్రోలు మండల పరిధిలో ఉన్న ఐదు షాపులకు నాలుగింటికి మంగళవారం వరకు కూడా ఒక్క దరఖాస్తు కూడా పడలేదని సమాచారం. ఇక్కడ ఏమైనా రాజకీయ సిండికేట్ జరిగిందా అనే అనుమానం కూడా తలెత్తుతోంది. ప్రకాశం, బాపట్ల జిల్లాల డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 11న లాటరీ తీయడానికి ఏర్పాట్లతో పాటు షాపులకు వచ్చిన దరఖాస్తులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి

బల్లికురవ, అక్టోబరు 8: ప్రజాసమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులకు నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. అభివృద్ధి పనుల బిల్లులు చెల్లింపు విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎంపీడీవో కుసుమ కుమారి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు తమ పనితీరును మెరుగు పరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో జరగాలన్నారు. తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ మండలంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీడీపీవో సుధ, ఎంఈవో వస్త్రం నాయక్, ఏఈ మాధవరెడ్డి, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తాగునీటిని విధిగా పరీక్షలు చేయాలి

చీరాలటౌన్, అక్టోబరు 8: పురపాలక పరిధిలోని ప్రజలకు అందించే తాగునీటిని విధిగా పరీక్షలు చేయాలని మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ సూచించారు. మంగళవారం పురపాలక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అందించే సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంటి, నీటి కుళాయిలు, షాపులు పన్నులు సకాలంలో చెల్లించాలన్నారు. అందుకనుగుణంగా సిబ్బంది పన్నులు వసూళ్లు చేయాలని చెప్పారు. అనంతరం 31వ వార్డులో డ్రయినేజీ పనులు పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, వార్డు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారుడి కుటుంబానికి ఆర్థికసాయం

అద్దంకిటౌన్, అక్టోబరు 8: అద్దంకికి చెందిన కళాకారుడు షేక్ పెద్ద మస్తాన్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈక్రమంలో అద్దంకిలోని గాత్ర, వాద్య కళా కారుల సంక్షేమ సంఘం తరుపున సభ్యులు మంగళవారం వారి కుటుంబ సభ్యులను కలిసి రూ.పది వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. షేక్ పెద్దమస్తాన్ బ్యాండ్ మేస్త్రీ, సంక్షేమ సంఘం కోశాధికారిగా సేవలందించారు. కార్యక్రమం లో సంఘ అధ్యక్షుడు జి.శేషగిరిరావు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు త్రివిక్రమ అగస్త్యేశ్వర ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం

చెరుకూరు(పర్చూరు), అక్టోబరు 8: చెరుకూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీత్రివిక్రమ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో విజయ దశమి సరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సామూహిక అక్షరాభ్యాసన కార్యక్రమం నిర్వ హించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి మల్లవరపు నాగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని కోరారు.

అందరిచూపు ఇంకొల్లు వైపే!

» మూడు మద్యం షాపులకు 107 దరఖాస్తులు

» నేటితో ముగియనున్న గడువు

పర్చూరు, అక్టోబరు 8: మద్యం షాపుల టెండర్లకు సంబంధించి అందరి చూపు ఇంకొల్లు మండలంపై కేంద్రీకృతమైంది. మండలంలో ఉన్న మూడు షాపులకు సంబంధించి ఇప్పటికే 107 దరఖాస్తులు రావటం ఇందుకు నిదర్శనం. బుధవారంతో దరఖాస్తుల గడువు ముగియనుంది. మరింత సంఖ్యలో దరఖాస్తులు వస్తాయన్న అలోచనలో ఇటు మద్యం షాపులను దక్కించుకునేందుకు పోటీపడుతున్న వారితోపాటు అధికారుల్లో సైతం చర్చనీయాంశంగా మారింది. పర్చూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు, యద్దనపూడి మండలాలకు సంబంధించి మొత్తం 15 మద్యం షాపులకుగాను ఇప్పటికే 294 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అందులో అత్యధిక జనాభా ఉన్న మార్టూరు మినహా ఉన్న మిగిలిన మూడు మండలాల్లో అత్యధికంగా ఇంకొల్లు మండలంలో అధికంగా దరఖాస్తులు వచ్చాయి. పర్చూరు మండల పరిధిలో ఉన్న నాలుగు మద్యం షాపులకు గాను 52 దరఖాస్తులు, మార్టూరులో 127, ఇంకొల్లులో 107 దరఖాస్తులు వచ్చాయి. అత్యల్పంగా యద్దనపూడి మండలంలోని రెండు షాపులకు గాను కేవలం ఎనిమిది దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

కాగా, పర్చూరులోని ఎక్సైజ్ స్టేషన్‌లో మద్యం దరఖాస్తుల ప్రక్రియను ఒంగోలు అసిస్టెంట్ కమిషనర్ విజయ, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.జనార్దన్ పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా చూడాలని స్థానిక ఎక్సైజ్ సీఐ ఎం.భుజంగరావుకు సూచించారు.



పర్చూరు ఎక్సైజ్ స్టేషన్‌లో మద్యం దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ విజయ

తక్కువ పెట్టుబడులతో నాణ్యమైన దిగుబడులు సాధించాలి

» వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్.మోహన్‌రావు

పర్చూరు, అక్టోబరు 8: రైతులకు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించి తక్కువ పెట్టుబడులతో నాణ్యమైన దిగుబడులను సాధించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్.మోహన్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లపూడి, అడుసుమల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులతో కలిసి పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పంటలు సాగుచేస్తున్న ప్రతిరైతు ఈపంటను నమోదు చేసుకోవాలన్నారు. తద్వారా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటలు నష్టపోతే ప్రభుత్వం ద్వారా ఉచిత బీమా సౌకర్యం పొందేందుకు ఎంతగానో దోహద పడుతుందన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ఎన్.మేరిమ్మ, తదితరులు పాల్గొన్నారు.



అడుసుమల్లిలో పైర్లను పరిశీలించి రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రైతులు తప్పనిసరిగా ఈక్రాప్ చేయించుకోవాలి

వేటపాలెం(చీరాల), అక్టోబరు 8: రైతులు నిర్ణీత కాలవ్యవధిలో ఈక్రాప్ చేయించుకోవాలని తహసీల్దార్ పార్వతి తెలిపారు. మండలంలోని కొత్తపేట రెవెన్యూ పరిధిలో తహసీల్దార్ సూపర్ చెక్ రికార్డులను పరిశీలిం చారు. ఈసందర్భంగా ఏవో కాశీవిశ్వనా ధ్ మాట్లాడుతూ ఈ నెల 18 నాటికి ఈక్రాప్ పూర్తిచేసి రైతు సేవాకేంద్రాలలో సోషల్ ఆడిట్‌కు ఉంచుతామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో ఫక్రుద్దీన్, వీఏఏ లు వినయ్, శివ, నాగబాబు తదితరు లు పాల్గొన్నారు.

మిరపలో జిగురు అట్టలను ఏర్పాటుచేసుకోవాలి

అద్దంకిటౌన్, అక్టోబరు 8: మండలంలో మిరప సాగుచేస్తున్న రైతులు జిగురు అట్టలను ఏర్పాటుచేసుకోవాలని ఉద్యాన అధికారిణి ఎస్.దీప్తి అన్నారు. మంగళవారం మండలంలోని వెంపరాల, చక్రాయపాలెం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మిరప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా దీప్తి మాట్లాడుతూ మిరపలో రసం పీల్చు పురుగు నివారణకు పసుపు అట్టలను ఎకరాకు 20 ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కొప్రపాటి వెంకటకృష్ణ, ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆధునిక పద్ధతులు ఉపయోగించాలి

పంగులూరు, అక్టోబరు 8: సాంకేతిక పద్ధతులతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని రేణంగివరం, కశ్యాపురం గ్రామాలలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మినుము, సుబాబుల్ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో సుబ్బారెడ్డి మట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, ధూళిపాళ్ల నారాయణస్వామి, శ్రీనివాసరావు, రవి పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు

ఇంకొల్లు, అక్టోబరు 8: విత్తనశుద్ధితో అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్.మోహనరావు రైతులకు సూచించారు. మండలంలోని వంకాయలపాడులో మంగళవారం జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగ విత్తనాలను టుబకానజోల్‌తో శుద్ధి చేసుకోవాలని సూచించారు. పత్తి పైరును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్, బేతపూడి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



దైవాలరావూరులో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ ధనరాజ్, ఏవో శ్రీనివాసరావు

అందుబాటులో ఎరువులు

మేదరమెట్ల, అక్టోబరు 8: రైతులు తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని ఏడీఏ ధనరాజ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దైవాలరావూరు, బొల్లవరప్పాడు గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఏడీఏ ధనరాజ్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన డీఏపీ ఎరువులను సొసైటీలో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అవసరమైన మేరకే ఎరువులను ఉపయోగించి అధిక దిగుబడులను సాధించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో దైవా లరావూరు, బొల్లవరప్పాడు రైతులు, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో సత్ఫలితాలు

బల్లికురవ, అక్టోబరు 8: తెగుళ్లను తొలిదశలో గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపడితే సత్ఫలితాలు వస్తాయని వ్యవసాయ సహాయ సంచాలకులు కె.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గుంటుపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వరి, మొక్కజొన్న పైర్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి, మొక్కజొన్నలో జింక్ లోపం ప్రధానంగా కనిపిస్తుందని చెప్పారు. దీని నివారణకు ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను పిచికారి చేయాలన్నారు. మొక్కజొన్నలో వచ్చే కాండం తొలిచే పురుగు, కత్తెర పురుగు నివారణకు తీసు కోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బందితో పాటు, రైతులు పాల్గొన్నారు.

ఎస్టీలందరికీ ఆధార్ కార్డులు ఉండేలా చర్యలు తీసుకోవాలి

అద్దంకిటౌన్, అక్టోబరు 8: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్టీలందరికి ఆధార్ కార్డులు ఉండేలా వారం రోజులలో చర్యలు తీసుకోవాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. దీనిపై మండలాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని మంగళవారం తహసీల్దార్ శ్రీచరణ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్టీ కాలనీలో అధికారులు వీధి దీపాలు ఏర్పాటుచేయాలని, ఇళ్లస్థలాలు లేని ప్రతి వ్యక్తికి స్థలం చూపించా లని కోరారు.

వర్షంతో పంటలకు జీవం

మార్టూరు, అక్టోబరు 8: మండలంలో మంగళవారం కురిసిన వర్షం పంటలకు జీవం పోశాయి. మండలంలో 470 ఎకరాలలో పత్తి సాగుచేస్తున్నారు. మార్టూరు, రాజుపాలెం, బొబ్బేపల్లి, డేగరమూడి గ్రామాలలో మొదటిదశ కాయలు కాస్తున్నాయి. నాగరాజుపల్లి, బొబ్బేపల్లి, వలపర్ల గ్రామాలలో మిరప పూతదశలో ఉంది. అవకాశం ఉన్న రైతులు మిరప పంటకు నీళ్లు పెట్టగా, మిగిలిన రైతులు నీటి కోసం వరుణుడిపై ఆధారపడ్డారు. నాగరాజుపల్లి, మార్టూరు తదితర గ్రామాలలో 380 ఎకరాలలో కంది సాగుచేస్తున్నారు. నీరులేక కందిపంట ఎండిపోయేదశలో ఉంది. ఈతరుణంలో కురిసిన వర్షం పంటలకు జీవం పోసింది.

పశువైద్యశాల పరిశీలన

మార్టూరు, అక్టోబరు 8: మండలంలోని కోలలపూడి గ్రామంలో పశువైద్యశాలను జిల్లా అధికారి డాక్టరు రమేష్ మంగళవారం పరిశీలించారు. వైద్యశాల ముందు శిథిలదశలో ఉన్న పాత పశువైద్యశాల భవనాన్ని ఆయన పరిశీలించారు. శిథిలమైన పాత పశువైద్యశాల భవనాన్ని తొలగించాలని గ్రామస్థులతో కలిసి సర్పంచ్ ఎం.సతీష్‌కుమార్ జిల్లా అధికారిని కోరారు. ఈమేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి మాధవీలత, గ్రామస్థులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, రంగబాబు, వీరాంజనేయులు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీశ్రేణుల సంబరాలు



హర్షం వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

చీరాల, అక్టోబరు 8 : హర్యానా, జమ్మూకాశ్మీర్‌లలో జరిగిన ఎన్నికలలో బీజేపీకి వచ్చిన సానుకూల ఫలితాలు పార్టీపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని బాపట్ల పార్లమెంట్ కన్వీనర్, ప్రముఖ న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్ అన్నారు. బీజేపీ గెలుపు, అభివృద్ధికి మలుపని అన్నారు. మంగళవారం స్థానిక గడియార స్తంభం సెంటర్లో పార్టీ శ్రేణులు బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు అర్వపల్లి కుమార్, కాకర్ల వెంకటేశ్వరరావు, శంకరశెట్టి నాగేశ్వరరావు, జయశంకర్, సాసిన మణికుమార్, పామంచి రాంబాబు, తడవర్తి చంద్రశేఖర్, మనోహరరెడ్డి, భవాని, మాచర్ల శ్రీనివాసరావు, బలరాంసింగ్, మేడికొండ భరణీరావు, పింజల భరణీరావు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపడి పశువుల కొష్టం దగ్ధం

పోతినవారిపాలెం(పర్చూరు), అక్టోబరు 8: పిడుగుపాటుకు పశువుల చావిడి దగ్ధమైన సంఘటన కారంచేడు మండలం పోతినవారిపాలెం గ్రామంలో సోమవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. ఈఘటనలో గ్రామానికి చెందిన పేర్రి ధనలక్ష్మి పశువుల చావిడి పూర్తిగా కాలిపోయింది. ఈప్రమాదంలో రూ.2లక్షల మేరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత మహిళ వాపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ శ్రీనివాసరావు కోరారు.

మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలి

ఎంపీడీవో స్వరూపారాణి



మాట్లాడుతున్న ఎంపీడీవో స్వరూపారాణి

పంగులూరు, అక్టోబరు 8 : గ్రామ పంచాయతీలలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేయాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి సూచించారు. మంగళవారం పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధన దిశగా పాలక వర్గం పనిచేయాలన్నారు. గ్రామాలో పారిశుధ్యం, ప్రజలకు తాగునీరు అందించడం, విద్యుదీకరణ, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పంచాయతీ నిర్వహణలో సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్, వార్డు సభ్యుల పాత్ర కీలకమన్నారు. ఈవోఆర్డీ సుమంత్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులు సక్రమంగా వినియోగించడంలో ప్ర జాప్రతినిధులపాత్ర కీలకమన్నారు. పంచాయతీ సమావేశాలు సకాలంలో నిర్వహించడం, తీర్మానాల అమలుకు సభ్యులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాసరెడ్డి, సుమంత్, సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, ఆర్వీ సుబ్బారావు, సీనియర్ కార్యదర్శులు రాంబాబు, సునీత, పంచాయతీ కార్యదర్శులు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా రాజ్యలక్ష్మి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన రాజ్యలక్ష్మి

మేదరమెట్ల, అక్టోబరు 8: కొరిశపాడు ఎంపీడీవోగా రాజ్యలక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సురేష్‌బాబు సాధారణ బదిలీలలో భాగంగా సంతనూతలపాడుకు బదిలీ అయ్యారు. ఇంకొల్లులో పనిచేస్తున్న రాజ్యలక్ష్మికి బదిలీకాగా, బాధ్యతలు స్వీకరించారు.

డీపీవోగా బాధ్యతలు స్వీకరించిన గొట్టిపాటి



పంచాయతీ అధికారికి బొకే ఇస్తున్న అధికారులు, సిబ్బంది

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 8: జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ)గా గొట్టిపాటి వెంకట నాయుడు బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం ఆయన విధుల్లో చేరారు. ముందుగా కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వెంకటనాయుడును పంచాయతీ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఓ) రాజేంద్రప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ జి.రామకృష్ణతోపాటు కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా బాధ్యతలు స్వీకరించిన వెంకటనాయుడును జిల్లాలోని పలు మండలాలకు చెందిన ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకు ముందు ఇన్‌చార్జీ డీపీవో ఉషారాణి నుంచి ఆయన బాధ్యతలను తీసుకున్నారు. గత మూడు రోజుల నుంచి ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులపై జరుగుతున్న పరిణామాలపై ఆయన ఆరా తీసినట్లు సమాచారం.

డీఎంహెచ్‌వో నియామకంపై గందరగోళం

జీవోను నిలిపివేశారంటూ ప్రచారం

రద్దు చేస్తున్నట్లు ఇంతవరకు రానీ సర్క్యులర్

రత్నావళి బాధ్యతల స్వీకరణపై నీలినీడలు

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 8 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా రత్నావళి నియామకంపై గందరగోళం నెలకొంది. గత నాలుగు నెలల నుంచి డీఎంహెచ్‌వో పోస్టు ఖాళీగా ఉండటంతో విజయవాడ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రత్నావళిని నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆ విషయం బయటకు వచ్చిన వెంటనే ఆమె నియామకాన్ని వ్యతిరేకిస్తూ ప్రజాప్రతినిధుల వద్దకు కొందరు పరుగులు పెట్టారు. 2020 నుంచి 2022 మధ్య కాలంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిగా పనిచేసిన రత్నావళిపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఆమె పనిచేసిన కాలంలో పలురకాల నియామకాల్లో అక్రమాలు చోటుచేసుకోవడంతోపాటు ఆమెపై లోకాయుక్తకు సింగరాయకొండకు చెందిన లక్ష్మీనారాయణ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. అయితే సరైన సమాచారం ఇవ్వకపోవడంతో 2022లో లోకాయుక్త ప్రభుత్వానికి సరెండర్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఆమెను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో పోస్టుల భర్తీ నుంచి ఉద్యోగోన్నతులు, డిప్యుటేషన్లు, ఒకచోట పనిచేస్తున్న ఉద్యోగికి ఎటువంటి ఆర్డర్ లేకుండా మరోచోట పనిచేసే విధంగా మౌఖిక ఆదేశాలు వంటి పలు ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలపై కూడా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విచారణ చేసినా ఎలాంటి చర్యలు లేకుండాపోయాయి.

ఇంతవరకు అందని సర్క్యులర్

ఈ నేపథ్యంలో తిరిగి మరలా డీఎంహెచ్‌వోగా రత్నావళి నియమితులయ్యారు. ఓ జనసేన నాయకుడి ద్వారానే ఆమె జిల్లాకు వస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ నియామకం జరిగిన వెంటనే ఇప్పటివరకు ఆ పోస్టు కోసం ప్రయత్నాలు చేస్తున్న అధికారులు ఖంగుతినడంతోపాటు ఆమె డీఎంహెచ్‌ఓగా ఉన్న సమయంలో ఇబ్బందులు పడిన వైద్యశాఖలోని డాక్టర్లు, వివిధ స్థాయిల్లోని ఉద్యోగులు వెంటనే ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ విషయాన్ని వెంటనే ప్రిన్సిపల్ సెక్రటరి ఎంటీ కృష్ణబాబు దృష్టికి తీసుకెళ్లారనే ప్రచారం జరుగుతోంది. అయితే ఆమెను నిలిపివేస్తున్నట్లు ప్రచారం మాత్రం నడుస్తోంది. అయితే నిలిపివేస్తున్నట్లు మంగళవారం సాయంత్రం వరకు కూడా సర్క్యులర్ రాకపోవడంతో పరిస్థితి ఏమిటనేది తెలియక అయోమయం నెలకొంది. ఆమె డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించాలన్నా వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టరేట్ నుంచి మూవ్‌మెంట్ ఆర్డర్ కూడా రావాల్సి ఉంది. కానీ మంగళవారం సాయంత్రం వరకు ఆ ఆర్డర్ వచ్చిన పరిస్థితి లేదు. ఏదిఏమైనా డీఎంహెచ్‌వో నియామకం విషయంలో నెలకొన్న గందరగోళానికి వెంటనే తెరదించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇంజన్ మొరాయించడంతో నిలిచిన పినాకిని రైలు

పలు రైళ్లకు అంతరాయం

చీరాల టౌన్, అక్టోబరు 8 : అకస్మాత్తుగా ఇంజన్ మొరాయించడంతో బాపట్ల జిల్లా కొత్త పందిళ్లపల్లి సమీపంలో చెన్నై నుంచి విజయవాడ వెళ్లే పినాకిని ఎక్స్‌ప్రెస్ అర్ధంతరంగా ఆగిపోయింది. 7:45కు చీరాలకు చేరాల్సి ఉండగా రాత్రి 8 గంటల సమయంలో కొత్త పందిళ్లపల్లి సమీపంలో ఆగిపోయింది. సుమారు రెండు గంటలపాటు కదల్లేదు. అయితే అధికారులు విజయవాడ నుంచి మరో ఇంజన్‌ను తెప్పించడంతో రాత్రి 10 గంటల సమయంలో బయలుదేరింది. ఈ నేపథ్యంలో అనేక రైళ్లు ఆలస్యంగా నడిచాయి. కాగా పినాకిని ఆగిపోవడంతో చీరాల, సమీప గ్రామాలకు చెందిన ప్రయాణికులు రైలు దిగి ఆటోలకు వెళ్లిపోయారు. అయితే దూరప్రాంతాలకు వెళ్లాల్సిన వారు, విజయవాడ నుంచి మరో రైలుకు బుక్ చేసుకున్న వారు నానా ఇబ్బందులు పడ్డారు.



ఇంజన్ మొరాయించడంతో చీరాలలో నిలిచిన పినాకిని ఎక్స్‌ప్రెస్

ఆంక్షలు.. అధిక ఫీజు



మందకొడిగా మద్యం దుకాణాల దరఖాస్తులు

ఇప్పటిదాకా సగటున ఆరేడు దాఖలు

ధిక్కరించి వేస్తే లాటరీలో వచ్చినా

మా అవసరం తప్పదంటూ హెచ్చరికలు

మరోవైపు ప్రతిబంధకంగా రూ.2లక్షల ఫీజు

అత్యధిక ప్రాంతాల్లో వెనక్కి తగ్గుతున్న ఔత్సాహికులు

వైసీపీ శ్రేణులు పూర్తిగా దూరం

నేటితో ముగియనున్న దరఖాస్తుల గడువు

11న దుకాణాల కేటాయింపు

ఒంగోలు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం దుకాణాలకు ప్రభుత్వం ఆశించిన విధంగా దరఖాస్తులు అందడం లేదు. ఒకవైపు అధికారపక్ష నేతల ఆంక్షలు, మరోవైపు దరఖాస్తు ఫీజు భారీగా ఉండటం అందుకు ప్రతిబంధకంగా కనిపిస్తోంది. నూతన మద్యం పాలసీ భాగంగా జిల్లాలో మొత్తం 171 షాపులను నోటిఫై చేశారు. ఒక్కొక్క దుకాణానికి సగటున 25 నుంచి 30 వరకు దరఖాస్తులు వస్తాయని అధికారవర్గాల అంచనా. ఒక్కొక్క దరఖాస్తుకు చెల్లించే రూ.2లక్షలు ఫీజు తిరిగి ఇచ్చేది లేదని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించడంతో అలా ఫీజు రూపంలోనే జిల్లాలో రూ.100 కోట్ల వరకు రాబడి ఉంటుందని భావించారు. దీనికి తోడు 171 దుకాణాలను రెండు కేటగిరిలు చేసి 120 షాపులకు ఒక్కొక్క దానికి ఏడాదికి రూ.65 లక్షలు, మిగిలిన 71 షాపులకు ఒక్కొక్క దానికి రూ.55లక్షలుగా ఫీజు నిర్ణయించారు. తద్వారా రూ.117 కోట్ల మేర రాబడి వస్తుందని భావించారు. అయితే జిల్లాలో ప్రభుత్వం అంచనా వేసిన స్థాయిలో దరఖాస్తులు పడటం లేదు. తిరిగి ఇవ్వని దరఖాస్తు ఫీజు గతంలో రూ.50వేలు ఉండగా ప్రస్తుతం దానిని రూ.2లక్షలకు పెంచడం ప్రతిబంధకంగా కనిపిస్తోంది. అలాగే ఏడాది లైసెన్సు ఫీజు కూడా అధికంగా ఉంది.

ఇబ్బందులు తప్పవన్న సంకేతాలతో..

ఈసారి ఎన్నికల్లో భారీ వ్యయం చేయాల్సి వచ్చిన నేపథ్యంలో ప్రతి పథకాన్ని ఆదాయ వనరుగా మార్చుకునే పనిలో అధికారపార్టీ నేతలు ఉన్నారు. మా వాళ్లు లేదా ముందుగా మాతో అవగాహనకు వచ్చిన వారు దరఖాస్తు చేసుకోండి లేదంటే ఇబ్బందులు తప్పవన్న హెచ్చరికలు పంపుతున్నారు. ఒకవేళ ఎవరైనా ధిక్కరించి వేసి లాటరీలో దుకాణం పొందినా దానిని నడపడంలో మా మద్దతు లేకుండా చేయలేరని హెచ్చరిస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఇలా హెచ్చరికలు బలంగా ఇస్తూ తమ వారి చేత నేరుగా దరఖాస్తులు చేపిస్తుండగా మరికొన్నిచోట్ల దుకాణాల కేటాయింపు తర్వాత వారితో ఒప్పందాలు చేసుకుంటామన్న సంకేతాలు ఇస్తున్నారు. దీంతో చాలాచోట్ల ఔత్సాహికులు దరఖాస్తులకు ధైర్యం చేయడం లేదు. లిక్కర్ వ్యాపారంలో అనుభవం, ఆసక్తి ఉన్న వైసీపీ నేతలు రాజకీయ అండ లేకుండా చేయలేవని దూరంగా ఉంటున్నారు. దీంతో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో దరఖాస్తులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

జిల్లాలో మద్యం దుకాణాలకు ప్రభుత్వం అంచనా వేసిన స్థాయిలో దరఖాస్తులు పడటం లేదు. దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు తిరిగి ఇవ్వకపోవడమే ప్రతిబంధకంగా కనిపిస్తోంది. అలాగే ఏడాది లైసెన్సు ఫీజు కూడా అధికంగా ఉందని చాలాప్రాంతాల్లో ఆ స్థాయిలో అమ్మకాలు, ఆదాయం ఉండకపోవచ్చని భావిస్తున్నారు. ఇక అంతకన్న జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అధికార ముఖ్యనేతల జోక్యం, వారి అనుచరులు వ్యవహారశైలి ఇబ్బందికరంగా ఉంది. మా ప్రాంతంలో మాకే షాపులు ఉండాలన్న ఆలోచన అధికారపార్టీ నేతలు చేస్తున్నారు. దీంతో దరఖాస్తులు మందకొడిగా పడుతున్నాయని సమాచారం.

నేటితో ముగియనున్న గడువు

మద్యం దుకాణాల దరఖాస్తులు బుధవారం సాయంత్రంతో గడువు ముగియనుంది. అయితే మంగళవారం సాయంత్రం ఆరున్నర గంటల వరకు చూస్తే సగటున ఒక్కొక్క దుకాణానికి ఏడెనిమిదికి మించి దరఖాస్తులు వచ్చిన పరిస్థితి లేదు. అందిన సమాచారం మేరకు 171 దుకాణాలకు 1,296 దరఖాస్తులు వచ్చాయి. అందులో అత్యధికంగా 32 షాపులు ఉన్నాయి. ఒంగోలు సర్కిల్‌లో 191 దరఖాస్తులు రాగా అత్యల్పంగా 16 దుకాణాలు ఉన్నా పొదిలి సర్కిల్‌లో 69 దాఖలయ్యాయి.

- ఒంగోలులో అధికారపార్టీ ముఖ్యనేత తరపున సమీప బంధువు రంగంలోకి దిగి సిండికేట్ ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అన్ని దుకాణాలకు మేము లేదా మా వారు వేస్తారు. ఇతరులు ఎవరు వేసినా ఇబ్బందులు తప్పవన్న హెచ్చరికలు బయటకు పంపారు. అంతేకాక నగరాన్ని ఐదు క్లస్టర్లుగా చేసి ఆ ప్రాంతంలో షాపులకు ఒక్కొక్క దానికి నాలుగైదు దరఖాస్తులు వేసేలా అనుచరులను పురమాయించినట్లు సమాచారం. ఇతరులు దరఖాస్తు చేసినా లాటరీలో వారికి దుకాణం వచ్చినా తర్వాత అయినా మాకు అప్పజెప్పాల్సిందే. లేదంటే వాటా ఇవ్వాల్సిందేనన్న హెచ్చరికలు చేయడంతో మద్యం వ్యాపారంలోకి రావాలనుకున్న వారు కాస్తంత వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం.
- సంతనూతలపాడు నియోజకవర్గంలో చూస్తే వ్యాపారంలో బాగా అనుభవం ఉన్న ద్వితీయశ్రేణి నేత ఒకరు అన్ని షాపులకు మేమే వేస్తాం. ఇతరులు ఎవ్వరు రావడానికి వీలు లేదు. అలా వస్తే ఇబ్బందులు తప్పవని తనకు ముఖ్యనేత పూర్తి మద్దతు ఉందని హెచ్చరికలు పంపడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. అయితే సదరు నేత సొంత ప్రాంతానికి చెందిన కొందరు అధికారపార్టీ వారు అతనికి వ్యతిరేకంగా షాపులు కడుతున్నట్లు సమాచారం.
- కొండపి నియోజకవర్గంలో ముఖ్యనేతలు ఈ వ్యవహారానికి దూరంగా ఉన్నట్లు తెలుస్తుండగా వివిధ మండలాల్లో స్థానిక నేతలు మాత్రం సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తు చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది.
- దర్శి నియోజకవర్గంలో అధికారపార్టీ ముఖ్యనేత సమీప బంధువు తొలుత మొత్తం సిండికేట్ చేసి దరఖాస్తులు వేయించాలని భావించినా విమర్శలు వస్తాయన్న ఆలోచనతో వెనక్కు తగ్గినట్లు సమాచారం. షాపులు దక్కించుకున్న వారు వ్యాపారంలో అధికార పార్టీ అండ లేకుండా ఎలాగూ చేయలేరు కనుక అప్పుడు వాటాలు విషయం చూసుకోవచ్చని వారు భావిస్తున్నట్లు తెలుస్తోంది.
- గిద్దలూరు నియోజకవర్గంలో కీలక ప్రజాప్రతినిధి ప్రత్యక్షంగా జోక్యం చేసుకోకపోయినా వైసీపీ వారు వేస్తే ఇబ్బందులు తప్పవన్న సంకేతాలు పంపినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో అక్కడ టీడీపీ, బీజేపీ శ్రేణులు దరఖాస్తులు చేస్తుండగా తర్వాత వాటాలు ఇవ్వక తప్పదన్న చర్చ కూడా సాగుతోంది.
- కనిగిరి నియోజకవర్గంలో అక్కడి కీలక ప్రజాప్రతినిధిని కొందరు ద్వితీయశ్రేణి నేతలు ఆశ్రయించగా ఇప్పుడే ఎందుకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులు చేసుకొండి తర్వాత చూద్దాం అన్న సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో పలువురు దరఖాస్తు చేస్తుండగా షాపులు కేటాయింపుల తర్వాత పలుకుబడి ఉన్న అధికారపార్టీ నేతలు వాటిని దక్కించుకోవచ్చన్న ప్రచారం సాగుతోంది. అందులో అయితే ముఖ్యనేతలు దుకాణం ఎవ్వరికి వచ్చినా చేసుకోనేది మేమే అన్న సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.
- మార్కాపురం నియోజకవర్గంలో ముఖ్యనేత సన్నిహితులు మొదట్లో వసూళ్లు తప్ప ఎవ్వరు వేయవద్దన్న సంకేతాలు ఇచ్చినా తాజాగా రూటు మార్చి దుకాణాలు దక్కించుకొన్న వారికి ఎలాగు మన అండ అవసరం కనుక వారే వస్తారు. అప్పుడు చూద్దాం మన డిమాండ్ నెరవేర్చుకుందాం అన్న భావనలోకి వచ్చినట్లు తెలుస్తోంది. అయినా ఎక్కువ దరఖాస్తులు చేసేందుకు ముందుకు రావడం లేదని అంటున్నారు.
- యర్రగొండపాలెం నియోజకవర్గంలో మద్యం దుకాణాలకు సాధారణంగా డిమాండ్ తక్కువగా ఉంటుంది. దీంతో అధికారపార్టీ నేతల జోక్యం పెద్దగా లేదని తెలుస్తోంది.

'స్వర్ణాంధ్ర'లో భాగస్వాములు కావాలి

మంత్రి డాక్టర్ స్వామి పిలుపు

వర్క్‌షాపులో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 8: 'స్వర్ణాంధ్ర-2047 ఆంధ్రప్రదేశ్ విజన్' అజెండాతో చేయనున్న రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రతిఒక్కరు భాగస్వామ్యులు కావాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర రూపకల్పనలో భాగంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో మంత్రి స్వామి అధ్యక్షతన వర్క్‌షాపు జరిగింది. ముందుగా ఆయా శాఖల వారీగా జిల్లా అభివృద్ధికి దోహదపడే అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్గదర్శకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు సమగ్ర కసరత్తును చేపట్టారన్నారు. పీఎం మోదీ చెప్పినట్లుగా 2047 నాటికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే నాటికి దేశం పూర్తిగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ పేరుతో కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నారన్నారు. అందులోభాగంగా సీఎం చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర ద్వారా రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించడం, నిరుద్యోగ సమస్యను రూపుమాపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. మండల యూనిట్‌గా అభివృద్ధి పథంలో నడిపించేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. జిల్లాలో ఫార్మా రంగాన్ని ముందుకు తీసుకొచ్చేందుకు, గ్రానైట్ రంగానికి మరింత ప్రోత్సాహం కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వెలిగొండను త్వరగా పూర్తిచేస్తామన్నారు. జిల్లాలో వీలైంత వరకు చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలను చేపట్టి సమర్థవంతంగా నీటి సంరక్షణ చర్యలు చేపట్టేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు మార్కాపురంలో మెడికల్ కళాశాలను మౌలిక సదుపాయాలతోపాటు త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. దొనకొండ పారిశ్రామికవాడ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా జిల్లాకు సంబంధించి విజన్ డాక్యుమెంట్‌ను తయారుచేసేందుకు శాఖల వారీగా రెండు నెలల నుంచి శిక్షణ ఇస్తున్నామన్నారు. జిల్లా అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అన్ని రంగాల ప్రజలను భాగస్వాములను చేసి అందరి సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. మండల స్థాయిలో రాబోయే ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో జిల్లా అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కేంద్ర గృహ, అర్బన్ డెవలప్‌మెంట్ పార్లమెంటరీ కమిటీకి చైర్మన్‌గా నియమితులయ్యానన్నారు. ఆ కమిటీలో అమృత్, స్వచ్ఛభారత్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. సీఎస్ఆర్ నిధులను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ తన నియోజకవర్గంతోపాటు జిల్లా అభివృద్ధికి దోహదపడే విధంగా విజన్ డాక్యుమెంట్ రూపొందించడం ఎంతో ఉపయోగకరమన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ రైతులకు ఆదాయం వచ్చే ఉద్యాన పంటలపై విజన్ డాక్యుమెంట్ రూపకల్పన చేయాలన్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వ ఆధీనంలో కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. వర్క్‌షాపులో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, సీపీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వేటు ఎవరిపైనో?

బదిలీల పంచాయితీపై ఆందోళన

పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్న విచారణాధికారి

తమ పరిస్థితి ఏమిటో అర్థంకాక ఆందోళనలో ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 8 : జిల్లా పంచాయతీ ఉద్యోగుల బదిలీలలో జరిగిన అక్రమాలపై విచారణ నేపథ్యంలో సంబంధిత ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ప్రభుత్వం ఇటీవల ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో దానిని కొందరు అధికారులు ఆదాయ వనరుగా మార్చుకున్న విషయం తెలిసిందే. గ్రేడ్-5, 6 ఉద్యోగులను బదిలీ చేసేందుకు కౌన్సెలింగ్ నిర్వహించినా ఉత్తర్వులు ఇచ్చే విషయంలో జరిగిన పరిణామాలు తెలిసి అందరూ అవాక్కయ్యారు. ఆర్డర్లను ఇచ్చే విషయమై ఆయా ఉద్యోగులను ఒంగోలుకు రప్పించుకొని బేరసారాలు పెట్టిన విషయం తెలిసిందే. అయితే భారీ టార్గెట్ పెట్టడంతో ఉద్యోగులు అంత మొత్తం చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో వెలుగులోకి తీసుకురావడంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆరా తీయడంతోపాటు సమగ్ర విచారణకు ఆదేశించారు. ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్(ఎస్‌డీసీ) లోకేశ్వరరావును విచారణాధికారిగా నియమించారు.


పూర్తిస్థాయిలో విచారణ

గ్రేడ్-5, 6 ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులు ఇచ్చే విషయంలో జరిగిన పరిణామాలపై పూర్తిస్థాయి విచారణను విచారణాధికారి చేపట్టారు. కార్యాలయంలో ఈ ఉత్తర్వులు ఇచ్చే అధికారి, కీలక ఉద్యోగులతోపాటు సంబంధిత ఉన్నతాధికారిని విచారించారు. అయితే ఈ విచారణలో ఇన్‌చార్జీ డీపీవో ఉషారాణి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బదిలీలను చేపట్టానని ఆయనకు చెప్పినట్లు తెలిసింది. వివిధ కారణాలతో ఆర్డర్లు ఇచ్చేందుకు జాప్యం జరిగినట్లు పేర్కొన్నారు. బయట జరిగిన పరిణామాలకు తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. దీంతో సంబంధిత ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. తమకు అండగా ఉంటారనుకున్న వారే బయట జరిగే పరిణామాలకు తనకు సంబంధం లేదని చెప్పడంతో ఆయా ఉద్యోగులు వణికిపోతున్నారు. మరోవైపు విచారణాధికారి బదిలీల ఉత్తర్వులు పొందిన ఉద్యోగులతో కూడా మాట్లాడినట్లు సమాచారం. ఆ ఉద్యోగులు మొత్తం పూసగుచ్చినట్లు చెప్పినట్లు సమాచారం. బదిలీల ఆర్డర్‌ను పొందేందుకు ఎంత ఇచ్చింది, ఎవరికి ఇచ్చింది తదితర వివరాలను కూడా విచారణాధికారి సేకరించినట్లు సమాచారం. ఈ విషయాలన్ని ప్రస్తుతం బహిర్గతం కావడంతో ఎవరిపై వేటు పడుతుందోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



అద్దంకి దత్తపాదుకాక్షేత్రంలో...



మేదరమెట్లలో మహాలక్ష్మిగా అమ్మవారు

అద్దంకిటౌన్, అక్టోబరు 8: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పలు దేవాలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అద్దంకి పట్టణంలో శ్రీధన్వంతరి దత్తపాదుకా క్షేత్రంలో అమ్మవారిని శ్రీలలితా త్రిపురసుందరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో 6వ రోజు అమ్మవారిని గజలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

పంగులూరులో..

పంగులూరు, అక్టోబరు 8: మండలంలోని పలుగ్రామాలలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. పంగులూరులోని గ్రామ పంచాయితీ కూడలిలో మాజీ సైనికోద్యోగి చిలుకూరి ప్రసాదనాయుడు నేతృత్వంలో ఆరవ రోజు అమ్మవారిని 7 లక్షల నగదు నోట్లతో ధనలక్ష్మీ రూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. చందలూరులోని రేణుకమ్మ తల్లి ఆలయం, రేణంగివరంలోని పోలేరమ్మ తల్లి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి.

మేదరమెట్లలో..

మేదరమెట్ల, అక్టోబరు 8: కొరిశపాడు మండలంలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం ఆయా ఆలయాల్లో అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మేదరమెట్లలోని శ్రీకనకదుర్గదేవి ఆలయం, దైవాలరావూరులోని ఉమామహేశ్వరి ఆలయం, మండలంలోని పలుగ్రామాలోని దేవాలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించి ప్రత్యేక పూజలు చేశారు.



- మద్యం దుకాణాలకు నేటితో దరఖాస్తుల గడువు ముగింపు
- 182 షాపులకు అందింది 1,621
- నేతలు, వ్యాపారుల 'మిలాఖత్'
- వేసుకోనీయండి.. 'లక్కీ'లో తేల్చుకుందాం! అంటూ భరోసా
- 11వ తేదీ సాయంత్రం రహస్య సమావేశాలు?
- అక్కడే దిశానిర్దేశాలు?
- కూటమి ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు



ఎక్సైజ్ ఆశలకు సిండికేట్ గండి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 8 : ప్రైవేటు మద్యం షాపులకు కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేశాక జిల్లాలోని 182 షాపులకు భారీగా దరఖాస్తులు అందుతాయని ఎక్సైజ్ అధికారులు భావించారు. అయితే వీరి ఆశలపై 'సిండికేటుగాళ్లు' నీళ్లు చల్లారు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో ఈ వ్యవహారం నడుస్తున్నట్లు సమాచారం. మరోవైపు షాపులకు టెండర్ల ప్రక్రియ బుధవారం సాయంత్రం 5 గంటలకు ముగియనుంది. ఆశించిన స్థాయిలో దరఖాస్తులు అందుతాయా!? లేదా!? అన్నది వేచి చూడాలి.

నూతన మద్యం పాలసీలో భాగంగా గత ప్రభుత్వంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసి ప్రైవేటు వైన్‌షాపులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 1వ తేదీన నోటిఫికేషన్‌ను విడుదల చేసి, 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆశావహులకు పిలుపునిచ్చింది. దీంతో జిల్లావ్యాప్తంగా 182 షాపులకు మంగళవారం సాయంత్రం వరకు 1,621 దరఖాస్తులు అందాయి. బుధవారం సాయంత్రం గడువు ముగియనుండటంతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

● ఎన్ని దరఖాస్తులు.. ఎవరేశారు!?

బార్‌లకు టెండర్లు అయినా.. మద్యం దుకాణాలకు దరఖాస్తులు వేయాలన్నా ఎప్పటినుంచో పాతుకుపోయిన లిక్కర్ వ్యాపారులు చాలా మందే ఉన్నారు. అలాంటి వారందరినీ నియోజక వర్గాల వారీగా సిండికేట్ అవ్వాలని కూటమి నాయకులు సూచించారు. దీంతో ఇప్పటికే సిండికేట్‌గా మారిన వ్యాపారులు ఎక్సైజ్ అధికారులతో కుమ్మక్కై రోజుకు ఎన్ని దరఖాస్తులు వస్తున్నాయి. ఆఫ్‌లైన్‌లో ఎన్ని? ఆన్‌లైన్‌లో ఎన్ని.. సర్కిల్ వారీగా ఎన్ని నమోదయ్యాయి. అన్న వివరాలు ఏ రోజుకు ఆరోజు తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో ఏ ప్రాంతాలకు తక్కువ దరఖాస్తులు పడ్డాయో ఆ ప్రాంతాలకు దరఖాస్తులు వేయాలన్న అధికారుల సూచనలతో వ్యాపారులు అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

● లైసెన్సు వచ్చాక మీటింగ్ పెడదాం..

ఇప్పటికే రాజకీయ నాయకులు ఆయా ప్రాంతాల్లో వ్యాపారులను సిండికేట్ చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే సౌలభ్యం ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి దరఖాస్తులు పడుతున్నాయి. "సరేలే.. వేయనివ్వండి. ఎవరికి లైసెన్సు వచ్చినా వైన్‌షాపు పెట్టాల్సింది మన ప్రాంతంలోనే కదా.. లైసెన్సు పొందిన తర్వాత 11వ తేదీ సాయంత్రం ఓ మీటింగ్ పెడుదాం. మనం చెప్పినట్లు, మనం అడిగినవి చేస్తే సరే లేకుంటే ఆ వైన్‌షాపు ఎలా జరుగుతుందో చూద్దాము.' అంటూ నాయకులు తమ అనుచరులు, వ్యాపారులతో అంటున్నారు.

● ఆత్మకూరులో అదే ధీమా!

'ఎవరేస్తే మనకేంటబ్బా. అందరూ దరఖాస్తు వేయనీ. లాటరీలో షాపు తీసుకున్న తర్వాత చూద్దాం. మనల్ని కాదని షాపు తెరవలేడు కదా! అప్పుడు చూద్దాం.' ఆత్మకూరు నియోజకవర్గంలో ఇదీ వరస. ఇక్కడ మొత్తం 12 షాపులకు గాను మంగళవారం సాయంత్రానికి 144 దరఖాస్తులు అందాయి. మద్యం వ్యాపారంలో ఆరితేరిన వారు అధికార పార్టీలోని కొందరు నేతలతో కలిసి సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తు చేసుకునేందుకు మంతనాలు సాగిస్తున్నారు. రూ.2 లక్షలు చెల్లించి ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. లాటరీలో ఎవరి పేరు వస్తుందో.. వారికి మద్యం దుకాణం కేటాయిస్తారు. అయితే ఆయా ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకులను కాదని దుకాణం నడపడం కష్టంతో కూడుకున్న వ్యవహారం. కాబట్టి ఎవరెన్ని దరఖాస్తులు చేసుకున్నా మనకేం.. చివరకు దుకాణం మన ఆధ్వర్యంలో నడవాల్సిందేగా అనే ధీమాలో కొందరు నేతలు వ్యూహరచన చేస్తున్నారు.

- ఆత్మకూరు

● కందుకూరు : కందుకూరు నియోజకవర్గంలోనూ అధికార పార్టీ నాయకుల హవా కొనసాగుతోంది. నియోజకవర్గంలోని అన్ని దుకాణాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా సిండికేట్ వ్యవహారం నడుస్తోంది. కాగా, 17 దుకాణాలకు 122 దరఖాస్తులు నమోదవగా, మంగళవారం ఒక్కరోజే 93 దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల సంఖ్య పెంచాలంటూ ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఆదేశించడంతో స్థానిక అధికారులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

● కావలిలో నేతల అభయం కోసం..

కావలి నియోజకవర్గ పరిధిలో 22 మద్యం షాపులకు ఎక్సైజ్ అధికారులు గెజిట్ ప్రకటించారు. ఇప్పటికే వ్యాపారులు సిండికేట్ అవగా, అధికార పార్టీ నేతల అభయం కోసం పాకులాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో బయటి వ్యక్తులు దరఖాస్తు చేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. కావలి సర్కిల్ పరిధిలో ఉన్న 17 షాపులకు మంగళవారం మధ్యాహ్నానికే 70 వరకు దరఖాస్తులు వచ్చాయి. కొన్నిచోట్ల మాత్రం సిండికేట్ దరఖాస్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. మద్యం షాపుల కేటాయింపులో గౌడ సామాజిక వర్గానికి 10 శాతం రిజర్వేషన్లు ఉన్నాయని తెలియడంతో వారికి ఏ షాపులు కేటాయిస్తారో స్పష్టత లేదు. దీంతో ఇతరులు దరఖాస్తులు వేయడానికి వెనుకంజ వేస్తున్నారు. మొత్తానికి ప్రభుత్వం ఆశించిన స్థాయిలో దరకాస్తులు రాకపోవటంతో సిండికేట్‌ల ప్రభావం ఉందనే ప్రచారం నడుస్తోంది.

- కావలి



నెల్లూరు ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లు

● సర్వేపల్లి నియోజక వర్గంలో 28 మద్యం దుకాణాలకు దరఖాస్తులు నమోదవుతున్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఎక్కువగా నమోదు చేస్తుండగా ఆఫ్‌లైన్‌లో మందకొడిగా సాగుతోంది. ఇక్కడ కూడా అధికార పార్టీకి చెందిన నాయకులు తప్ప బయట వ్యక్తులు దరఖాస్తులు వేసేందుకు ఆసక్తి చూపడం లేదని ప్రచారం నడుస్తోంది.

నేటి సాయంత్రం వరకే గడువు

వైన్‌షాపులకు బుధవారం సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 5 గంటలకు క్యూలైన్‌లో ఉన్న వారందరి దరఖాస్తులు స్వీకరిస్తాము. లైసెన్సు పొందిన వారు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులను వాయిదాల పద్ధతిలో చెల్లించవచ్చు. వ్యాపారులు ఏ ప్రాంతంలో ఉన్నా ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తులు వేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారు మాత్రమే లాటరీలో పాల్గొనాల్సిన అవసరం లేకుండా వారికి నచ్చిన వారిని పంపే సౌలభ్యం ఉంది. ఆసక్తి ఉన్న వ్యాపారులంతా వెంటనే దరఖాస్తు వేసుకోవాలి.

- శ్రీనివాస్‌రావ్, డీసీ, ఎక్సైజ్

● 'గిరి'లో అంతా పక్కాగా!

ఉదయగిరి ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మర్రిపాడు, సీతారామపురం, దుత్తలూరు, ఉదయగిరి మండలాల్లో 12 మద్యం షాపులకుగాను మంగళవారం సాయంత్రానికి 63 దరఖాస్తులు అందాయి. దరఖాస్తు రుసుం, లైసెన్సు ఫీజు అధికంగా ఉండటంతో ఎలాంటి ఆదాయం ఉండదని కొందరు దరఖాస్తు చేసుకొనేందుకు వెనుకంజ వేస్తున్నారు. అంతేగాక ఉదయగిరి నియోజకవర్గంలో కొందరు కూటమి నాయకులు లాటరీలో ఎవరికి షాపు వచ్చినా తమకు వాటా ఇవ్వాల్సిందేనట్లు పట్టుబడుతున్నారు. గతంలో ఉదయగిరిలో లిక్కర్ కింగ్‌గా వ్యవహరించిన వారు సైతం లాభాలు ఉండవని ఈసారి దూరంగా ఉంటున్నట్లు సమాచారం. అయితే వారు బినామీల ద్వారా దుకాణాలకు దరఖాస్తు చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఎవరికి లాటరీ తగిలినా అందరం సిండికేట్ అవుదామనే దరఖాస్తుదారులు చర్చించుకుంటున్నట్లు సమాచారం. దీనికితోడు ఇప్పటికే కొంతమంది గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వహణపై ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ మేరకు బెల్టుషాపుల నిర్వాహకులు దరఖాస్తుదారులకు అడ్వాన్స్ కింద నగదు సైతం ఇచ్చినట్లు సమాచారం.

- ఉదయగిరి రూరల్

● నగర, రూరల్‌లో వారిదే అంతా!

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 30 వైన్‌షాపులు, నెల్లూరు రూరల్‌లో 3 షాపులను అధికారులు కేటాయించారు. కార్పొరేషన్ పరిధిలో భారీగా దరఖాస్తులు వస్తాయని భావించినా కేవలం 200 వరకే వచ్చినట్లు సమాచారం. ఇప్పటికే ఎక్సైజ్ అధికారులు బార్ల యజమానులకు ఫోన్లు చేసి 'గడువు సమీపిస్తోంది. దరఖాస్తులు వేసుకోవాలని కోరుతున్నారు. అయితే, వ్యాపారులు మాత్రం సిండికేట్‌గా మారి తక్కువ సంఖ్యలోనే దరఖాస్తులు వేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీనివెనుక అధికార పార్టీ నాయకులు ఉన్నట్లు సమచారం. వైన్‌షాపులు ఎవరికి వచ్చినా తాము ముందుగానే దుకాణాలు నిర్మించాము.. మా దుకాణంలోనే వైన్‌షాపు ఏర్పాటు చేయాలని సిండికెట్ సభ్యులకు తేల్చి చెబుతున్నట్టు సమాచారం. 11వ తేదీ లక్కీడ్రా పూర్తయిన తర్వాత అదే రోజు లైసెన్సులు పొందిన వ్యాపారులతో నగర, రూరల్ నియోజకవర్గాలకు చెందిన వ్యాపారులతో వేర్వేరుగా నాయకులు సమావేశమై దిశానిర్దేశం చేయనున్నట్టు సమాచారం.

● బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి సర్కిల్ పరిధిలో వ్యాపారులు సిండికేట్ అయ్యారనే పుకార్లు షికారు చేస్తున్నాయి. సర్కిల్ పరిధిలోని 14 దుకాణాలకు మంగళవారం రాత్రి వరకు 167 దరఖాస్తులు వచ్చాయి. 135 ఆన్‌లైన్, 32 ఆఫ్‌లైన్ డిపాజిట్లు నమోదైనట్టు ఎక్సైజ్ సీఐ కిషోర్ తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్, జిల్లా అధికారులు

14 నుంచి పల్లె పండుగ

● జిల్లాలో 1009 పనులకు ప్రణాళిక : కలెక్టర్

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 8: గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ఈనెల 14వతేదీ నుంచి 21 వరకు పల్లె పండుగ పేరుతో పంచాయతీరాజ్ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జిల్లా అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులతో చెక్‌డ్యామ్‌లు, వాటర్ షెడ్‌లు, నీటికుంటలు, సీసీరోడ్లు, మురుగు కాలువలు, పంట కాలువల పనులను పెద్దఎత్తున చేపట్టాలని ఆదేశించారు. వీటితోపాటు ఉద్యానపంటలను చేపట్టాలన్నారు. వీటిని జనవరికల్లా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులందరిని భాగస్వామ్యం చేయడంతో పాటు పంచాయతీల్లో బోర్డులను ప్రదర్శించాలన్నారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో పల్లెపండుగలో రూ. 57.73కోట్లతో 1009 పనులను చేపట్టేలా ప్రణాళికలు రూపొందించా మన్నారు.ఆయా పనులకు ఇసుక, సిమెంట్ కొరత లేదని తెలిపారు. కార్యక్రమంలో డీపీవో శ్రీధర్ రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఎస్ఈ వెంకటరమణ, డిప్యూటీ సీఈవో మోహన్‌రావు పాల్గొన్నారు.

● త్వరలో సాగునీటి సంఘాల ఎన్నికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో త్వరలో సాగు నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు జరుగనున్నాయని, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమష్టిగా స్థానిక ఆయుకట్టు, రెవెన్యూ రికార్డుల ఆధారంగా ఓటరు జాబితా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ సూచించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్ నుంచి వీడియో కన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, మ్యూటేషన్లు, పారిశుధ్యం, ఉపాధి హామీ పనిదినాల పెంపు, మనబడి-మన భవిష్యత్తు పనులు, హౌసింగ్, పల్లె పండుగ కార్యక్రమాలపై సబ్ కలెక్టరు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను ఎలాంటి కారణాలు లేకుండా తిరస్కరించవద్దని, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో లవన్న, జడ్పీ ఇన్‌చార్జి సీఈవో మెహన్‌రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, డీఈవో రామారావు, తదితరులు పాల్గొన్నారు.

కిలో టమోటా రూ.50లకే

రైతుబజార్లలో రాయితీపై విక్రయాలు

నెల్లూరు (వ్యవసాయం)/ కావలి, అక్టోబరు 8 : జిల్లాలోని అన్ని రైతుబజార్లలో రాయితీపై టమోటాలను విక్రయిస్తున్నట్లు మార్కెటింగ్‌శాఖ ఏడీ పీ అనిత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి కిలో రూ.50 చొప్పున వినియోగదారు లకు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. తొలిరోజు ఒక్కొక్కరికి కిలో మాత్రమే విక్రయిం చామన్నారు. బుధవారం నుంచి రెండు కిలోల చొప్పున కార్డుదారులకు విక్రయిస్తామని పేర్కొన్నారు. ఇందుకుగాను ఆధార్ లేదా రేషన్ కార్డు చూపించాలని తెలిపారు. నెల్లూరు,కావలి, కందుకూరు, పొదలకూరు రైతుబజార్లకు తొలివిడతగా మూడు టన్నుల టమోటాలు వచ్చాయని వివరించారు. కాగా తొలిరోజు కావలిలో 20 బాక్స్‌ల టమోటాలు విక్రయించామని రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్ మధుబాబు తెలిపారు.

శ్రీలక్ష్మీ... శుభములివ్వవే !

వివిధ రూపాల్లో అమ్మవార్ల దర్శనం

● ఆరో రోజుకు చేరిన శరన్నవరాత్రి ఉత్సవాలు



నెల్లూరు : చండీ అలంకరణలో ఇరుకళల పరమేశ్వరి



నెల్లూరు : కాళికాదేవి అలంకారంలో శ్రీరాజరాజేశ్వరి



నెల్లూరు : ధనలక్ష్మిగా వాసవి కన్యకా పరమేశ్వరి



సంగం : అన్నపూర్ణాదేవి అలంకారంలో కామాక్షిదేవి

జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం నాటికి ఆరోరోజుకు చేరాయి. వివిధ అలంకారాలలో అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు పులకించిపోయారు. విశేష పూజలు, భక్తుల శరణుఘోష, వేదమంత్రాలతో ఆలయాలు మారుమోగాయి. పలు ఆలయాల్లో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకా పరమేశ్వరికి ధనలక్ష్మీ అలంకారం, శ్రీ రాజరాజేశ్వరి కాళికాదేవిగాను, నెల్లూరు గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి మహాలక్ష్మిగా, మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో భువనేశ్వరికి చండీగాను, శ్రీ కృష్ణధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదీదేవి త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

- నెల్లూరు (సాంస్కృతికం)



బుచ్చి : భండాసురవధ అలంకారంలో జొన్నవాడ కామాక్షితాయి



ఎస్ఆర్ పురం : బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి



కావలి : చండీ అలంకరణలో దుర్గాభ్రమరాంబ



కన్యకా పరమేశ్వరి ఆలయంలో కోలాటం ఆడుతున్న మహిళలు

అన్ని వసతులతో టిడ్కో ఇళ్లు

● త్వరలో లబ్ధిదారులకు అప్పగింత ● చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : జిల్లాలో నిర్మించిన టిడ్కో ఇళ్లలో పూర్తిస్థాయిలో వసతులు కల్పించి లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ తెలిపారు. టిడ్కో చైర్మన్‌గా ప్రకటించిన తర్వాత తొలిసారి మంగళవారం ఉదయం నెల్లూరుకు వచ్చిన ఆయనకు జనసేన పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో అజయ్ కుమార్‌ను సత్కరించారు. అనంతరం నెల్లూరు రూరల్‌లోని అల్లీపురంలో ఉన్న టిడ్కో గృహాలను కార్పొరేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు.



టిడ్కో గృహాల వద్ద లబ్ధిదారుల సమస్యలు వింటున్న అజయ్‌కుమార్

లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ వంద శాతం లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో శాంతిభద్రతల సమస్య, మందుబాబుల ఆగడాలు, వీధిదీపాలు ఇలా అనేక సమస్యలు ఉన్నాయని, అధికారులతో చర్చించి త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. ఇక జిల్లాలో జనసేన పార్టీని పునర్వ్యవస్థీకరణ చేయనున్నామని, నెల రోజుల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఇతర కేడర్‌లో నాయకులను ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, గునుకుల కిషోర్, సుందర రామిరెడ్డి, శ్రీరామ్, కృష్ణారెడ్డి, హరిరెడ్డి, నూనె రిషికేష్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా నక్కలవాగు వంతెన

● బిక్కుబిక్కుమంటూ వాహనదారుల ప్రయాణం

ఏఎస్‌పేట, అక్టోబరు 8: ప్రముఖ యాత్రాస్థలమైన ఏఎస్ పేట సమీపంలోని నక్కలవాగుపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారినా పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏఎస్ పేట నుండి హసనపురానికి వెళ్లే మార్గంలో చందులూరుపాడు సమీపంలో ఉన్న నక్కలవాగుపై సుమారు 5 దశాబ్దల క్రితం వంతెన నిర్మించారు. ప్రతిరోజు వందలాది వాహనాలు ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తుంటాయి. 8 సంవత్సరాల క్రితం ఈ వంతెన కింద ఉన్న పిల్లర్ కిందకు ఒరిగి వంతెనకు పిల్లర్‌కు మధ్య ఖాళీ ఏర్పడింది. అయినా దీనిపైనే వాహనాలు ప్రయాణం చేయడంతో వంతెన నెర్రలుబారింది. కింద బెస్‌మెంట్ కుడా దెబ్బతిని శిథిలావస్థకు చేరడంతో వంతెనకు సపోర్ట్‌గా ఇనుప దిమ్మెలను ఏర్పాటుచేసి తాత్కాలికంగా మరమ్మతులు చేయించి అప్పటినుంచి పట్టించుకోలేదు. దీంతో వంతెన శిథిలావస్థకు చేరింది.


శిథిలావస్థలో నక్కల వాగు వంతెన

వర్షాలు కురిస్తే ప్రమాదమే

వర్షాలు కురిస్తే ఆనకట్ట, పందిపాడు, హబీపురం తదితర చెరువులు, బీరాపేరు వాగు నుండి పారే నీరు మొత్తం ఈ వంతెన ద్వారానే ప్రవహిస్తాయి. ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు భారీ వాహనాలు వంతెన మీదుగా ప్రయాణిస్తే వంతెన కూలే ప్రమాదం ఉంది.

అంచనాలకే పరిమితం

నక్కలవాగుపై నూతన వంతెన నిర్మాణం దశాబ్దాలుగా అంచనాలకే పరిమితం అయింది. గత తెలుగుదేశం ప్రభుత్వంలో వంతెన నిర్మాణం కోసం మట్టి పరీక్షలు కూడా నిర్వహించి, సుమారు రూ. 2కోట్లతో అంచనాలు వేశారు. ఇంతలో ఎన్నికలు వచ్చి అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఈవంతెన నిర్మాణం గురించి పట్టించుకోలేదు. ఇకనైనా పాలకులు, అధికారులు, స్పందించి నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

కనులపండువగా అమ్మవారి అలంకరణలు

● ఊరూరా శరన్నవరాత్రి ఉత్సవాలు ● పోటెత్తిన భక్తజనం


ఆత్మకూరు : గాయత్రీ అలంకరణలో కన్యకాపరమేశ్వరి


ఉదయగిరి రూరల్: శివాలయంలో మహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు


వరికుంటపాడు: లక్ష్మీదేవి అలంకరణలో నాగారప్పమ్మ

ఆత్మకూరు, అక్టోబరు 8: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ అలంకారాలలో జగన్మాతను దర్శించుకుంటున్న భక్తులు పరవశించిపోతున్నారు. మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్తర బలిజవీధిలోని జ్వాలాముఖి ఆలయంలో అమ్మవారు మహా ధనలక్ష్మీ దేవి అలంకరణలో, పట్టణ సమీపంలో తిరునాళ్ళతిప్పలోని కాశీనాయన ఆశ్రమ ఆవరణలో ఉన్న దేవస్థానంలో గాయత్రిమాత ధాన్యలక్ష్మీగా, శివాలయంలో అన్నపూర్ణాదేవి గజలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఆలయ అర్చకులు విశేష పూజలు, కుంకుమార్చన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

●**ఉదయగిరి రూరల్:** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయగిరి పట్టణంలోని పార్వతీపరమేశ్వరాలయం, శ్రీసంతానలక్ష్మీదేవి ఆలయాల్లో అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

●**కావలి టౌన్:** పట్టణంలోని ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనం ఇచ్చారు. గ్రామదేవత కలుగోళశాంభవి రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చి శేషవాహన సేవలందుకున్నారు. పాతూరు శివాలయంలో దుర్గాభ్రమరాంబ చండీశ్వరిదేవిగా, విష్ణాలయం రాజ్యలక్ష్మీ అమ్మవారు ధనలక్ష్మీ అలంకరణలో, వడ్డెపాలెంలోని కనకదుర్గాదేవి అన్నపూర్ణాదేవిగా, ముసునూరు మహాలక్ష్మమ్మ సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ముసునూరు హనుమత్ క్షేత్రం దుర్గాదేవి శ్రీమహాలక్ష్మీదేవి అలంకరణలో పూజలు అందుకున్నారు.

●**కందుకూరు:** దేవీ నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు అమ్మవారు శ్రీమహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక కోవూరు రోడ్డులోని దుర్గా భవాని ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీదేవి అలంకరణకు రూ.20.40లక్షల నోట్లతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి కుంకుమార్చన, అష్టోత్తర పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

●**సంగం:** స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న శ్రీ కామాక్షీదేవి సమేత సంగమేశ్వరాలయంలో మంగళవారం రాత్రి అన్నపూర్ణదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గోపాలకృష్ణమూర్తి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

●**వరికుంటపాడు:** మండలంలోని తూర్పురొంపిదొడ్లలో ఉన్న మానసాదేవి అమ్మవారు మంగళవారం కాత్యాయనీదేవి అలంకరణలో, వరికుంటపాడులో శ్రీనాగారప్పమ్మ అమ్మవారు లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అలంరించారు.

●**సీతారామపురం:** శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి శాలలో, నారాయణంపేటలోని శ్రీ విజయకనకదుర్గాదేవి ఆలయాలలో బాలాత్రిపురసుందరీదేవి అలం కరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

●**అల్లూరు:** దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని పట్టణ పరిధిలోని దసరా దేవాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, కలుగోళమ్మ ఆలయం, పోలేరమ్మ ఆలయం, గంగమ్మ ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

●**బిట్రగుంట:** బోగోలు మండలంలోని పలు ఆలయాల్లో ఏడవరోజు అమ్మవారు మహాలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బోగోలు సాయిమందిరంలోని కనకదుర్గమ్మ మహాలక్ష్మీగా అలంకరించి దర్శించుకున్నారు. విశ్వనాథరావుపేట కోదండరామాలయంలో రాజరాజేశ్వరి అమ్మవారు మహాలక్ష్మీ అలంకరణలో పూజలందుకున్నారు.

●**కలిగిరి:** తెల్లపాడు భద్రకాళి అమ్మవారు మహలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా పండ్లరాశులు, పన్నీరు, పసుపు కుంకుమలతో ప్రత్యేక అభిషేకాలు, 108కమలాలతో జరిగిన అష్టోత్తర పూజలు చేశారు.

●**ఉలవపాడు:** స్థానిక అంకమ్మ, కనకదుర్గమ్మ, పోలేరమ్మ, జాలమ్మ, గంగమ్మ గ్రామ దేవతలు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం, సాయంత్రం ఉభయదాతలు అమ్మవారికి అభిషేకాలు, పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


కందుకూరు: కరెన్సీ నోట్లతో దుర్గామాత అలంకరణ


బిట్రగుంట: మహాలక్ష్మీ అలంకరణలో కనకదుర్గమ్మ


కలిగిరి: మహాలక్ష్మీ దేవి అలంకారంలో భద్రకాళి అమ్మవారు

నేటి నుంచి ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ

అల్లూరు, అక్టోబరు 8: మండలంలోని అన్ని పంచాయతీల ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రీ ఫ్రెష్మెంట్‌పై శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రజనీకాంత్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండురోజుల పాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తా మన్నారు. ప్రతి పంచాయతీకి చెందిన ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

ప్రభుత్వ పథకాల అమలుపై అవగాహన

ఆత్మకూరు, అక్టోబరు 8: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని పంచాయతీల ఉప సర్పంచులు, పాలకవర్గ సభ్యులకు ప్రభుత్వ పథకాల అమలుపై ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ వి డేవిడ్ అవగాహన కల్పించారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పంచాయతీల్లో పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వాహణ, పంచాయతీ ఆస్తుల పరిరక్షణ, అభివృద్ధి పనులపై పంచాయతీ కార్యదర్శులు, పాలకవర్గ సభ్యులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పలువురు ఉపసర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

లాభసాటి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి

కందుకూరు, అక్టోబరు 8: రైతులు లాభసాటి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏవో రాము సూచించారు. మంగళవారం పాలూరు, ఆనందపురంలో వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులతో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎరువులు కావాలసిన రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా జిల్లా మార్క్‌ఫెడ్ సెక్రటరీకి ఇండెంట్ పెట్టుకొని ఎరువులు తెప్పించుకోవాలని సూచించారు. ఉద్యానశాఖలో 50 శాతం రాయితీతో యంత్ర పరికరాలు ఉన్నట్లు మండల ఉద్యాన శాఖ అధికారి బ్రహ్మసాయి తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ ఖాసిం, గ్రామ వ్యవసాయ సహాయకులు సీహెచ్ బ్రహ్మయ్య, రైతులు పాల్గొన్నారు.

●**లింగసముద్రం :** వరి పైరు సాగు చేసే రైతులు తక్కువ కాలపరిమితి గల వంగడాలను సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి అబ్రహంలింకన్ తెలిపారు. మంగళవారం ఎర్రారెడ్డిపాలెం, పెదపవని రైతుసేవా కేంద్రాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. రబీలో తక్కువ కాలపరితి గల కెఎన్‌ఎం 1638 వంగడం పంట కాలం 120రోజులకే వస్తుందన్నారు. అలాగే ఆర్ఎన్ఆర్ 15048(తెలంగాణా మసూరి) 130రోజులే అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ సహాయకులు వినయ్‌కుమార్, ఉద్యాన సహాయకులు కిరణ్‌కుమార్, విఎఎలు సుధీర్, నజీర్, విహెచ్ఎ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అడ్డొచ్చిన శునకం : బైక్ బోల్తా పడి ఒకరికి గాయాలు

లింగసముద్రం, అక్టోబరు 8: చీమలపెంట గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు హనుమంతరావు మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై మండలకేంద్రానికి వెళుతున్నాడు. స్థానిక జంపాలవారిపాలెం ఎస్సీ కాలనీలో హఠాత్తుగా కుక్క అడ్డువచ్చింది. ఆయన కంగారు పడి సడన్ బ్రేకు వేయడంతో ముందుకు పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయన తలకు, పక్కటెముకలకు, మోకాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. అక్కడే ఉన్న కొందరు యువకులు ఆయన్ను పైకిలేపి మంచినీరు తాగించి, లింగసముద్రంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. విషయం తెలిసిన బంధువులు మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తీసుకెళ్లారు. అయితే ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు గుంటూరుకు తరలించినట్లు బంధువులు తెలిపారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కనకదుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే కాకర్ల


పూజల్లో పాల్గొన్న కాకర్ల దంపతులు

వింజమూరు, అక్టోబరు 8: ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ప్రవీణ దంపతులు విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వున్న కనకదుర్గమ్మను మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పార్టీ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

30 మద్యం సీసాల పట్టివేత

ఉలవపాడు, అక్టోబరు 8: కరేడు పంచాయతీ వాక గ్రామానికి చెందిన పొడమేకల సాంబశివరావు మంగళవారం అలగాయపాలెం రోడ్డు వద్ద 30క్వాటర్ల మద్యం బాటిళ్లను మద్యం అమ్మేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

ఆర్డీవోను కలిసిన ఆర్టీసీ డీఎం


ఆర్డీవోను సత్కరిస్తున్న ఆర్టీసీ డిపో అధికారులు

కావలి, అక్టోబరు 8: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో ఎం.వంశీక్రిష్ణ మంగళవారం ఆయన చాంబరులో కావలి ఆర్టీసీ డీఎం రాపూరు శ్రీనివాసులు తమ సిబ్బందితో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డీఎం మాట్లాడుతూ గ్రూప్1 టాపర్‌గా నిలిచిన వంశీక్రిష్ణ కావలి ఆర్డీవోగా రావటం కావలి ప్రజల అదృష్టమన్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది అందించిన సేవలను వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఎం. రామకృష్ణ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవిప్రకాష్ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు చెత్తను తరలించాలి

కావలి, అక్టోబరు 8: పట్టణంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. పురపాలక సంఘ 2,3 శానిటరీ డివిజన్‌లకు సంబంధించి మస్టర్ పాయింట్లను తనిఖీ చేసి కార్మికుల హాజరును పరిశీలించారు. అనంతరం చెత్త స్టోరేజ్ పాయింట్ల వద్దకు వెళ్లి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని కార్మికులను ఆదేశించారు. అలాగే తుమ్మలపెంట రోడ్డులోని ట్రాన్‌సిట్ పాయింట్‌ను తనిఖీ చేసి చెత్త తరలింపుపై సూచనలిచ్చారు.

ముళ్లచెట్ల తొలగింపు


ముళ్ల చెట్లు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

బిట్రగుంట, అక్టోబరు 8: కొండబిట్రగుంట వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే పంచాయతీ లింక్‌రోడ్డుకు ఇరువైపులా అల్లుకున్న ముళ్లచెట్లను మంగళవారం మాజీ టీడీపీ కన్వీనర్ సుధాకర్ పొక్లెయిన్ సహాయంతో తొలగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కావలి ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి ఆదేశాలతో ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అలాగే దెబ్బతిన్న రోడ్డుకు ప్యాచ్ వర్క్ త్వరలో చేప డతామన్నారు.

గ్రావెల్ రోడ్డు ఏర్పాటుపై హర్షం

కావలి రూరల్, అక్టోబరు 8: స్థానిక ముసునూరు బాలాజీ వీధి నుండి రైల్వే ట్రాక్ రోడ్డులో గ్రావెల్ వేయడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముసునూరు ఇందిరమ్మకాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ, అట్టలఫ్యాక్టరీ కాలనీలకు వెళ్లే ఈ రోడ్డు గుంతలు ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఉండేవన్నారు. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రెండురోజుల్లో పనులు చేపట్టారని తెలిపారు. అలాగే ఇందిరమ్మ కాలనీలో గ్రావెల్ వేయించాలని స్థానికులు కోరారు.

స్పేస్ క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు

కొండాపురం, అక్టోబరు 8: అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి మండలస్థాయిలో జరిగిన క్విజ్ పోటీల విజేతలకు మంగళవారం నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో బహుమతులు అందజేసినట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఖాదర్‌బాషా తెలిపారు. పోటీలో 9 వ తరగతి జాహ్నవి మొదటిస్థానం, 8వ తరగతి భవేష్ మూడవస్థాంలో నిలిచాడన్నారు. నెల్లూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో శ్రీహరికోట అంతరిక్ష పరిశోధనకేంద్ర అధికారులు వీరికి మెమొంటో, సర్టిఫికెట్లు అందజేశారన్నారు.


జాహ్నవికి జ్ఞాపిక అందజేస్తున్న షార్ అధికారి

ఆర్డీవోను కలిసిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

కావలి : నూతన ఆర్డీవో వంశీక్రిష్ణను మంగళవారం రాత్రి కావలి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ ఇన్‌చార్జి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆర్డీవో చాంబరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలను ప్రతాప్‌రెడ్డి ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు సన్నిబోయిన ప్రసాద్, శ్రీనివాసులు, ప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


బిట్రగుంట, అక్టోబరు 8: బోగోలు మండలం బిట్రగుంట పంచాయతీలోని పలువురు బాధిత కుటుంబాలను మంగళవారం మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పరామర్శించారు. అందులో వైసీపీ నేత కర్తం సురేంద్రరెడ్డి, కూరపాటి అయ్య ప్పరెడ్డి, పొట్లపల్లి మాల్యాద్రి, కోర్సిపాటి వేంకటేశ్వరరెడ్డి, కొండబిట్రగుంట కాకు శీనయ్యలు ఉన్నారు. ఆయన వెంట గోపాల్‌రెడ్డి, వెంకటరామకృష్ణ, వెంకటసుబ్బారెడ్డి, షేక్ బాషా, మస్తాన్, సీహెచ్.వెంకారెడ్డి ఉన్నారు.

సోమశిలలో 53.139 టీఎంసీల నీరు

అనంతసాగరం, అక్టోబరు 8: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి మంగళవారం 19,893 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 52.139 టీఎంసీలుగా నమోదైంది. దిగువ డెల్టాకు 2,000, కండలేరుకు 8,500, ఉత్తర కాలువకు 540, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

గరుడ వాహనంపై శ్రీవారి విహారం

కావలి టౌన్, అక్టోబరు 8: స్థానిక బృందావనం కాలనీలోని వెంకటేశ్వరస్వామికి మంగళవారం ఉదయం మోహిని పల్లకీ ఉత్సవం, రాత్రి గరుడ వాహన సేవలందించారు. టీటీడీ అర్చక బృందం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరగ్గా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరామ్ మాల్యాద్రి పర్యవేక్షించారు. సాయంత్రం లక్ష్మీకాసుల ఉత్సవం అనంతరం ర్వహించిన గ్రామోత్సవం కనులపండువగా సాగింది.


గరుడ వాహనంపై విహరిస్తున్న వేంకటేశ్వరస్వామి

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 8: పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి ఆంజనేయుల నాయక్ సూచించారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని శకునాలపల్లి, కృష్ణంపల్లి రైతుసేవా కేంద్రాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. పంటల సాగులో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం క్షేత్రస్థాయిలో సాగులో ఉన్న పంటలను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏ చల్లా పూజిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

● కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ


రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రీపూజ

వరికుంటపాడు, అక్టోబరు 8: పంట నమోదు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ హెచ్చరించారు. మంగళవారం గువ్వాడి రెవెన్యూ పరిధిలోని జీ కొండారెడ్డిపల్లి గ్రామానికి సంబంధించిన రైతుల పొలాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఈ-పంట నమోదు చేయించుకున్న రైతులు తప్పనిసరిగా పొలాలను సాగు చేసుకోవాలన్నారు. ప్రక్రియ తుది దశకు చేరుకోవడంతో ప్రభుత్వ నిబంధనల మేరకు జాబితాలను పరిశీలించేందుకు ప్రత్యేక అధికారులను నియమించారు. అందులో భాగంగా పరిశీలన చేపట్టిన ఆమె పంట పొలాలతోపాటు సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు హేమంత్‌కుమార్, ఉదయగిరి ఏవో ఆంజనేయులనాయక్, వీఆర్వో ప్రసాద్‌రావు, వీఏఏ హరినాథ్, సర్వేయరు రేణుకా తదితరులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది' రైతులకు ఉపయోగకరం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి పుట్టా సత్యవాణి

ఆత్మకూరు, అక్టోబరు 8 : గ్రామాల్లో ప్రతి మంగళ, బుధవారాల్లో నిర్వహించే పొలం పిలుస్తోంది కార్యక్రమం రెతులకు ఎంతో ఉపయోగకరమని జిల్లా వ్యవసాయాధికారి పుట్టా సత్యవాణి తెలిపారు. మండలంలోని మహిమలూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యాన శాఖల ద్వారా అందిస్తున్న పథకాలను రైతులకు వివరించారు. ప్రస్తుత రబీ సీజన్‌లో అనువైన వరి రకాలు, సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ, మండల వ్యవసాయాధికారి కె కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

●**అనంతసాగరం:** రాబోవు రబీ సీజన్లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను కొరత లేకుండా అందిస్తామని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి తెలిపారు. మంగళవారం మండలంలోని ఆమనిచిరివేళ్లలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని రసాయనాలు తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై అన్నదాతలు మొగ్గుచూపాలని, అతిగా పురుగుమందులు వాడవద్దన్నారు. కార్యక్రమంలో ఏడీఏ దేవసేనమ్మ, ఏవో శ్రీనివాసచక్రవర్తి, శ్రీధర్‌రెడ్డి, సర్పంచు లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

14 పంచాయతీలకు సీసీ రోడ్ల మంజూరు


రజక కాలనీలోని మట్టి రోడ్డును పరిశీలిస్తున్న డీఈ మాణికుమార్

సీతారామపురం, అక్టోబరు 8 : మండలంలోని 14 పంచాయతీలలో సుమారు రూ. 2 కోట్ల 37 లక్షల నిధులతో సీసీ రోడ్లు మంజూరయ్యాయని డీఈ మాణికుమార్ తెలిపారు. మంగళవారం రజక కాలనీలోని మట్టిరోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ మండ లంలో మట్టి రోడ్డు లేకుండా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. మంజూరైన పనులకు త్వరలో ఎమ్మెల్యే శంకుస్థాపన చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఏఈ తిరుమలయ్య, ప్రవీణ్‌కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుమతి, దేవర వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాకర్ల చొరవతో..

ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చొరవతో సీతారామపురం పంచాయతీకి 18 సిమెంట్ రోడ్లు మంజూరయ్యాయని సీతారామపురం పంచాయతీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దేవర వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీతా రామపురం పంచాయతీలో రజక కాలనీ, పడమటి వీధి, నారాయణంపేట, కురవ వీధి, బెస్త కాలనీ, వివి కోటాల్‌లలో సిమెంట్ రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈమేరకు ప్రజల తరపున ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

ఏఎస్ పేట, అక్టోబరు 8: రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరిం చాలని ఆత్మకూరు ఆర్డీవో పావని తెలిపారు. మంగళవారం ఆమె ఏఎస్ పేటలో పర్యటించారు. తహసీల్దారు కార్యాలయంలో పలువురు అర్జీ దారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సకాలంలో సమస్య లను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామంలోని రేషన్ షాపులను పరిశీలించారు. అనంతరం నాయబ్ రసూల్ దర్గాను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో పావని